Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్కూలేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను

• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్సీ ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 337 | హైదరాబాద్ | శనివారం 24 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR

కాంగ్రెస్ కు కోదండం..!

తెలంగాణలో రాబోయే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తున్న రేవంత్ రెడ్డి ప్లాన్ బెడిసి కొట్టేలా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ అధికారం లోకి వచ్చేందుకు పూర్తి శక్తి ఉపయోగించిన టీ జే ఎస్ అధ్యక్షులు కోదండరాం తో పాటు, వామపక్ష పార్టీ లు రేవంత్ తీరుపై కినుక వహించాయి.

- ఎమ్మెల్సీ అభ్యర్థులపై టీ జే ఎస్, వామపక్షాలు ఆగ్రహం
- ఏకపక్షంగా అభ్యర్థులను ఎంపిక చేసారని కినుక
- ఉమ్మడి అభ్యర్థి ని నిలిపే యూచన
- ఇరకాటం లో హస్తం పార్టీ
- రేవంత్ స్పీడ్ కు బ్రేక్



(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఈ పరిణామం తో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రారంభంలోనే ఊహించని రాజకీయ సంకటం ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి నడిచిన మిత్రపక్షాలను పక్కనబెట్టి, ఏకపక్షంగా అభ్యర్థుల ఖరారు వైపు అడుగులు వేయడం గాంధీభవన్‌ను రాజకీయ ఉక్కపోతలోకి నెట్టింది. ముఖ్యంగా, ఉద్యమాలకు , ఉద్యోగ-ఉపాధ్యాయ సంఘాలకు పెట్టని కోటగా ఉన్న ఉమ్మడి ఖమ్మంవరంగల్‌నల్గొండ పట్టభద్రుల స్థానంపై ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని తెలంగాణ జనా సమితి మొదటినుంచీ భారీ ఆశలు పెట్టుకుంది. అయితే, కాంగ్రెస్ పెద్దలు ఈ ఆకాంక్షలను కాదని ఏకపక్షంగా వ్యవహరించడంపై టీజేఎస్‌తో పాటు క్షేత్రస్థాయిలో బలమైన ఓటు బ్యాంకు కలిగిన సీపీఐ, సీపీఎంలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

కాంగ్రెస్‌కు సమస్యే

ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో వామపక్షాలకు, విద్యావంతుల వర్గానికి దశాబ్దాల నుంచి స్పష్టమైన ఓటు బ్యాంకు , ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్ ఉన్నాయి. అసెంబ్లీ సమరంలో కాంగ్రెస్‌తో జతకట్టి అధికార పీఠాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించిన తమ ఉనికిని, కనీస సంప్రదింపులు కూడా లేకుండా పక్కన పెట్టడాన్ని కమ్యూనిస్టు పార్టీలు తీవ్ర ధిక్కార వైఖరిగా పరిగణిస్తున్నాయి. దీంతో, కాంగ్రెస్ పార్టీకి తమ రాజకీయ బలాన్ని రుచి చూపించేందుకు టీజేఎస్ , సీపీఐ, సీపీఎంలు సంయుక్తంగా మూడో అభ్యర్థిని బరిలోకి దించే దిశగా వేగంగా పావులు కదుపుతున్నాయి. ఈ ఐక్య వేదిక రూపుదిద్దుకుంటే, అది కచ్చితంగా హస్తం పార్టీ విజయ అవకాశాలను దెబ్బతీసే పెద్ద అస్త్రంగా మారనుంది.

కాంగ్రెస్ ఓట్లకు గండి

పట్టభద్రుల నియోజకవర్గాల్లో సాధారణ ఎన్నికల లాగా కేవలం పార్టీ గుర్తులతో ఓట్లు పడవు. ప్రాధాన్యత ఓటింగ్ విధానం ఇక్కడ గెలుపోటములను శాసిస్తుంది. ఈ తరహా పోరులో ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ సంఘాల మద్దతు ఉన్న టీజేఎస్-వామపక్షాల ఉమ్మడి అభ్యర్థి బరిలో నిలబడితే, కాంగ్రెస్‌కు పడే మొదటి ప్రాధాన్యత ఓట్లలో భారీగా కోత పడటం ఖాయం. గ్రాడ్యుయేట్ స్థానాల్లో సైద్ధాంతిక స్పష్టత కలిగిన లెఫ్ట్ , ఐక్య పోరాటాల బ్యాక్‌గ్రౌండ్ ఉన్న ఓటర్లు అధికంగా ఉంటారు. ఈ ఓటు బ్యాంకు కాంగ్రెస్ హ్యాండ్‌బుక్ నుంచి చేజారి ఉమ్మడి అభ్యర్థి వైపు మళ్లితే, అది రేవంత్ రెడ్డి సర్కార్ ఆశించిన క్లీన్ స్వీప్ రికార్డుకు గండి కొడుతుంది.

బహుముఖ పోటీలో ప్రతి ఓటు కీలకమే

మరోవైపు, ప్రతిపక్ష బిఆర్ఎస్ , దూకుడుగా ఉన్న కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సే , అలాగే జాతీయ పార్టీ అయిన బీజేపీ కూడా ఈ పట్టభద్రుల స్థానంలో గట్టి పోటీని ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఈ బహుముఖ పోటీ వాతావరణంలో కాంగ్రెస్ తన మిత్రపక్షాలను కోల్పోయి ఒంటరిగా బరిలోకి దిగడం అంటే.. ప్రతిపక్షాలకు రాజకీయ మైలేజ్ ఇవ్వడమే అవుతుంది. బిఆర్ఎస్, బీజేపీలు ఉమ్మడి ఖమ్మం-నల్గొండ-వరంగల్‌లో ఉన్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు శ్రమిస్తుండగా, మిత్రపక్షాల తిరుగుబాటు కాంగ్రెస్ వ్యూహకర్తలను తీవ్రమైన ఆత్మరక్షణలో పడేసింది. గాంధీభవన్‌లో ఇప్పటికే ఈ పరిణామంపై అత్యవసర అంతర్గత చర్చలు మొదలైనట్లు సమాచారం.

చర్చలు జరుపుతున్న మహేష్ గౌడ్

పరిస్థితి చేయిదాటిపోక ముందే ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు సీపీఐ, సీపీఎం అగ్రనేతలతో చర్చలు జరిపి, కాంప్రమైజ్ ఫార్ములాను కుదర్చాలని కాంగ్రెస్ సీనియర్లు రేవంత్ రెడ్డి , పీసీసీ నాయకత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ సమరాల్లో మిత్రపక్షాలను కలుపుకుని పోకపోతే రాబోయే రోజుల్లో పార్లమెంట్, క్షేత్రస్థాయి రాజకీయాల్లో ఇబ్బందులు తప్పవనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. టీజేఎస్ , కమ్యూనిస్టుల ఉమ్మడి అభ్యర్థి ప్రచారం ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల సమరంలో సరికొత్త సమీకరణాలకు తెరలేపింది. కాంగ్రెస్ పార్టీ తన పెద్దరికాన్ని ప్రదర్శించి అసంతృప్త మిత్రులను ప్రసన్నం చేసుకుంటుందా లేక తమ ఒంటరి ప్రయాణంతో ఎమ్మెల్సీ రిజల్ట్‌లో సంచలన మలుపులను ఆహ్వానిస్తుందా అనేది రానున్న రోజుల్లో జరగబోయే పొలిటికల్ చర్చలపై ఆధారపడి ఉంది.



హద్దుమీరుతున్న చైనా

- అరుణాచల్ సరిహద్దు వెంట ఘర్షణలు
- దీటుగా బదులిస్తున్న మన శౌర్య కమాండోలు
- గల్వాన్ వంటి ఘటనలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ
- వెల్లడించిన ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్
- ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి: ఖర్గే

న్యూఢిల్లీ, అక్టోబరు 23 (ప్రజాతీర్పు)

ఇండియా, చైనా సరిహద్దు వెంట ఘర్షణలు కొనసాగుతున్నాయని.. చైనా హద్దుమీరుతున్నదని ఇండో బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ అధికారికంగా ప్రకటించారు. జూలై నుంచి ఈ ఘర్షణ వాతావరణం నెలకొందని, ఇప్పటికీ అదే పరిస్థితి ఉందని -2వ పేజీలో

తాగు అవసరాలకే గండం



- వచ్చే సీజన్‌లో చుక్క నీరు దొరకని పరిస్థితి
- కరవుపై ఆరు నెలలుగా హెచ్చరిస్తున్నాం
- నవంబర్ 1న ఢిల్లీలో 'జ్ఞానేశ్ గో బ్యాక్' గర్జన
- కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 23 (ప్రజాతీర్పు)

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న వర్షాభావ, కరవు పరిస్థితులను సమగ్రంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరవు కాదని, ప్రకృతి వైపరీత్యం కారణంగా ఏర్పడుతున్న పరిస్థితి అని పేర్కొన్నారు. ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంతో పాటు నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, రైతులకు అవగాహన, పశు సంపద పరిరక్షణ, గ్రామీణ ఉపాధిపై దృష్టి సారించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం -2వ పేజీలో

మీకు అధికారం దక్కదు

- మీరు విదేశాల్లో ఉన్నారుగా.. నా మాటలు వినిపించవులే
- రాహుల్‌గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సెటైర్
- పంజాబ్‌లో తదుపరి ప్రభుత్వం ఎన్డీఏదేనని అమిత్‌షా స్పష్టం
- యమునా నది ప్రక్షాళనకు రూ.8,941 కోట్లతో ప్రాజెక్టుల ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబరు 23 (ప్రజాతీర్పు)

సర్‌లో అవకతవకలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిరసన తెలుపుతున్నాయి. ఈ తరుణంలో రాహుల్ గాంధీ(ఇష్టబ్రశ్రీ +ఙఅఽష్టఱ) విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా(ఙఎఱ్ ఇష్ట్రఱష్ట్ర) ప్రతిపక్ష నాయకుడిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'రాబోయే 30 ఏళ్లైనా మీకు అధికారంలోకి వచ్చే అవకాశం -2వ పేజీలో

పొన్నం.. శబాష్..!

- రాష్ట్ర మంత్రికి కేంద్ర మంత్రి ప్రశంశ
- హుస్నాబాద్ లో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసినందుకు..

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)



హుస్నాబాద్ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించేందుకు 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ చొరవను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రస్తావించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ లేఖ రాశారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, ఇతర వేడుకల్లో వినియోగించుకునేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల పూర్తి సెట్లతో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్లాస్టిక్ వినియోగాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను క్షేత్రస్థాయిలో తగ్గించేందుకు దోహదపడుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి వివరించారు. అధిక కాలుష్యానికి కారణమయ్యే, తక్కువ ఉపయోగం కలిగిన గుర్తించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం, ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌పై ఉత్పత్తిదారుల విస్తరించిన బాధ్యత అమలు, వస్తువులను తిరిగి వినియోగించడం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం వంటి చర్యలు ఇందులో భాగమని తెలిపారు. ప్లాస్టిక్‌కు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తయారు చేసిన 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాల తయారీదారులు, విక్రేతల సంకలనం' ను 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంకలనం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో -2వ పేజీలో

4 వేల కుటుంబాల ప్రాణాలతో చెలగాటమాడొద్దు




జగిత్యాల, అక్టోబరు 23 (ప్రజాతీర్పు)

నూకపల్లి డబల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న డంపింగ్ యార్డ్ సమస్యపై బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు. కాలనీలో గత రెండు రోజులుగా చెత్తకుప్పలకు విపరీతంగా మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదాల కారణంగా నలుగురైదుగురు కాలనీవాసులు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 4 వేల కుటుంబాలు (10 వేలకు పైగా జనాభా) నివసించే ఈ ప్రాంతంలో ప్రజల ఆరోగ్యం పట్ల యంత్రాంగం బాధ్యత -2వ పేజీలో

విద్యుత్ కొరత రాకుండా

చర్యలు తీసుకుందాం



హైదరాబాద్, అక్టోబరు 23 (ప్రజాతీర్పు)

- యాదాద్రి ప్లాంట్‌లో 2 యూనిట్లకు కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా
- బకాయిల వసూళ్లు, విద్యుత్ ఉత్పత్తి పెంపుపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

కరువు పరిస్థితుల్లో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదే శించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బొగ్గు లభ్యత, బకాయిల వసూళ్లపై సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. సచివాలయంలో గురువారం విద్యు త్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి -2వ పేజీలో

తాగు అవసరాలకే గండం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత, వ్యవసాయం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిస్థితులను బట్టి సాగునీటి కంటే తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి రావచ్చన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలని సూచించారు. కరవు పరిస్థితులపై ప్రజలకు సమాచారం అందించేందుకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిరోజూ బులెటిన్ విడుదల చేయాలని ఆదేశించారు.

నీటి లభ్యతను బట్టి పంటల సాగు

రానున్న సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంచుకోవాలని సీఎం రైతులకు సూచించారు. నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు, కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని చెప్పారు. రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకునేలా మార్గనిర్దేశం చేయాలని వ్యవసాయ శాఖకు సూచించారు. వానాకాలం పంటలను సాధ్యమైనంత వరకు రక్షించడంతో పాటు రైతులకు నష్టం జరగకుండా కొనుగోలు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సన్నవడ్ల బోనస్ విషయంలో ప్రతిపక్షాలు చేసిన విమర్శలను ఖండిస్తూ, ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రైతులకు మార్కెట్‌లో మెరుగైన ధరలు లభించాయని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల వ్యాపారులు క్వింటాలుకు రూ.3,400 నుంచి రూ.4,000 వరకు ధరలు ఇచ్చేందుకు ముందుకొచ్చారని తెలిపారు.

విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, నీటి అవసరాలు అధికం కావడంతో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ నమోదవుతోందని వివరించారు. విద్యుత్ సరఫరా కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్ శాఖ అధికారులు చేస్తున్న కృషిని సీఎం అభినందించారు. తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం వల్ల కుటుంబ అవసరాలు తీరడంతోపాటు మిగులు విద్యుత్‌ను విక్రయించి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం పొందుతున్నారని వివరించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం, బొగ్గు లభ్యత, విద్యుత్ ఉత్పత్తి వ్యయంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బొగ్గు లభించే ప్రాంతాలకు సమీపంలోనే విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం సాధారణ విధానమని, కానీ సింగరేణి ప్రాంతాలకు దూరంగా దామరచర్లలో యాదాద్రి ప్లాంట్ నిర్మించడం వల్ల బొగ్గు రవాణా వ్యయం పెరిగిందని విమర్శించారు. బొగ్గు రవాణా కోసం ఏటా సుమారు రూ.2 వేల కోట్ల భారం పడుతోందని పేర్కొన్నారు. ప్లాంట్ నిర్మాణం నాలుగేళ్లలో పూర్తి కావాల్సి ఉండగా, పదేళ్లు గడిచినా గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. నైని ప్రాంతం నుంచి బొగ్గు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో సంప్రదింపులు జరిపి మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి కూడా బొగ్గు సరఫరా పొందేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

ఉపాధి హామీతో గ్రామీణులకు భరోసా

కరవు ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గినా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. భూమిలేని పేదలు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడకుండా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. సంక్రాంతి నుంచి మే వరకు నాలుగు నెలలపాటు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఆయా కాలంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగించినట్లు చెప్పారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించని వారిపై చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అప్పగించినట్లు వెల్లడించారు.

కరవుపై రాజకీయాలు వద్దు

ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాన్ని రాజకీయ విమర్శలకు పరిమితం చేయడం సరికాదని సీఎం అన్నారు. కరవును కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కరవు ప్రభావం తెలంగాణకే పరిమితం కాలేదని.. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో పాటు బ్రిటన్, అమెరికా వంటి దేశాల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని నమ్మకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నీటి లభ్యతను పట్టించుకోకుండా పంటలు సాగు చేయాలని ప్రోత్సహించడం రైతులను పెట్టుబడి నష్టాల్లోకి నెట్టడమేనని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని ఆదేశించారు.

ఎస్ఐఆర్‌పై నవంబర్ 1న ఢిల్లీలో సభ

ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అర్హులైన పేదల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించబోదని అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో పోరాటం కొనసాగుతోందని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం సాధించాలని సీఎం పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. మహబూబ్‌నగర్ -- రంగారెడ్డి -- హైదరాబాద్ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు ఆశించిన స్థాయిలో లేదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. పార్టీ ఎంపిక చేసిన సామా రామ్మోహన్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

ప్రజలకు అండగా నిలవాలి: భట్టి విక్రమార్క

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో రాజకీయ విమర్శలకు బదులుగా ప్రజలకు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్షాలకు సూచించారు. రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాల కొరత ఉందని, సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, రబీలో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలు, పశువులు, పక్షులకు తాగునీరు అందించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు.

సమష్టి కార్యాచరణకు మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపు

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, కరువు ముప్పును ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై గ్రామస్థాయి నుంచి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకుని నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టించడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను అరికట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, కరువు ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.

30 ఏళ్లైనా మీకు అధికారం దక్కదు

(మొదటి పేజీ తరువాయి)

ఉండదు. మీరు విదేశాల్లో ఎక్కడో కూర్చుని ఉన్నారు. నా మాట మీకు వినిపించవని నాకు తెలుసు. ఎందుకో కూడా మీరు చెప్పరు. కానీ పర్వాలేదు. అది మీ వ్యక్తిగత జీవితం.. కానీ మీరు ఢిల్లీలో అడుగుపెట్టగానే నా మాట వినండి.ఎన్నికల సమాచారం చూడండిరాబోయే ముప్పు ఏళ్ల వరకు మీ వంతు రాదు' అని స్పష్టం చేశారు. ఓట్ల దొంగతనం ఆరోపణలపై అమిత్ షా కాంగ్రెస్‌పైనా, దాన్ని మిత్రపక్షాలపైనా ఎదురుదాడి చేశారు. నిరసనలు, ప్రదర్శనల వల్ల ఏమీ సాధిం చలేరు. పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా 'మీ కూటమి ఎన్నికల్లో ఓడిపోతూనే ఉంది' అని ఎద్దేవా చేశారు. పంజాబ్‌లో తదుపరి ప్రభుత్వాన్ని ఎన్డీఏ ఏర్పాటు చేస్తుందని అమిత్ షా అన్నారు. యమునా నది ప్రక్షాళన కోసం రూ. 8,941 కోట్ల విలువైన 43 ప్రాజెక్టులను ప్రారంభిం చిన అనంతరం అమిత్‌షా మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై ఎద్దేవా చేశారు.రాబోయే మూడు దశాబ్దాల పాటు ఆయన పార్టీ అధికారానికి దూరంగానే ఉంటుందని జోస్యం చెప్పారు. బీజేపీ ఓట్ల దొంగతనం ఆరోపణలు చేస్తున్నందుకు షా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలపై కూడా విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార పక్షంపై ఈవీఎం ట్యాంపరింగ్, ఓట్ల దొంగతనం ఆరోపణలు చేశాయ ని, కానీ దశాబ్దాలుగా అనేక రాష్ట్రాల్లో అధికారంలో లేవని షా అన్నారు. 'మీరు 54 ఏళ్లుగా బెంగాల్లో ఎన్నికల్లో గెలవలేదు.. 12 ఏళ్లుగా అరుణాచల్ ప్రదేశ్‌లో, 18 ఏళ్లుగా ఢిల్లీలో ఎన్నిక కాలేదు' అని ఆయన ఎత్తి చూపారు.'30 ఏళ్ల పాటు బీజేపీ అధికారంలో ఉంటుందని నేను చెప్పినప్పుడు, ఎన్నికలలో రిగ్గింగ్ జరిగిందని ప్రజలకు చెబుతారు. లేకపోతే అమిత్‌షాకు ఎలా తెలుస్తుంది? అని అంటారు. ప్రతి ఆరు నెలలకు విదేశాలకు వెళ్లాల్సిన వారిలా కాకుండా, నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే జీవిస్తున్నాను, ఇక్కడే చనిపోతాను' అని రాహుల్ గాంధీని పరోక్షంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. 'బీజేపీ బూత్ కార్యకర్తల నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు, లక్షలాది మంది బీజేపీ కార్యకర్తలకు ప్రజల కష్టాలు తెలుసు. వాటిని పరిష్కరించడానికి వారు తీవ్రంగా కృషి చేస్తున్నారు' అని పేర్కొన్నారు. 'నిరసనలు, ప్రదర్శనల వల్ల ఏమీ సాధించలేరు. రాజకీయాలు చూడండిమీరు ఎన్నికైన చోటికి ఒక ప్రణాళికను తీసుకురండి' అని అన్నారు. కాంగ్రెస్, ఆప్‌లపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి చేస్తూ, రాబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో 'సాకులు చెప్పే రాజకీయాలు' ఆప్‌ను కాపాడలేవని షా అన్నారు. పంజాబ్‌లోని ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, ఎన్నికలలో ఆప్ ఘోరంగా ఓడిపోతుందని ఆయన పేర్కొన్నారు. యమునా నది కాలుష్యాన్ని ఉదాహర ణగా చూపుతూ, ఏళ్ల తరబడి అధికారంలో ఉన్నప్పటికీ ఆప్, కాంగ్రెస్ పార్టీలు నదిని శుభ్రపరచడంలో విఫలమయ్యాయని షా ఆరోపిం చారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు నది ప్రవాహ మార్గం పొడవునా దానిని శుభ్రపరిచేందుకు కృషి చేస్తాయని ఆయన ప్రకటించారు.'నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీకి, యమునోత్రి నుంచి సంగమం వరకు యమునా నది మొత్తాన్ని ప్రక్షాళన చేసే అవకాశం లభిస్తుంది. ఇప్పుడు, ఇటువంటి రాజకీయ ఎత్తుగడలు, మూక పాలనతో దేశ తీర్పును మీరు కాదనలేరు' అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ వియత్నాం పర్యటనపై బీజేపీ వెంటనే విమర్శనాస్త్రాలు సంధించింది. ఢిల్లీలో జరిగిన నిరసనల సమయంలో 'అబద్ధాలు అరవడం'తో అలసిపోయిన గాంధీ వారసుడు సెలవుపై వెళ్లారని ఆరోపించింది. ఇందుకు సంబంధించి ఒక వీడియోను కూడా ఆ పార్టీ షేర్ చేస్తూ, 'రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల అజెండా ఏమిటి? అని ప్రశ్నించింది. గాంధీ తన వ్యక్తిగత సమయంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని కాంగ్రెస్ బీజేపీ నేతల వ్యాఖ్యలను కొట్టిపారేసింది.

విద్యుత్ కొరత రాకుండా చర్యలు తీసుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు.

రోజువారీ ఉత్పత్తి 140 మిలియన్ యూనిట్లకు లక్ష్యం

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్ప త్తిని మరింత పెంచాలని భట్టి చెప్పారు. టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజు వారీ సగటు ఉత్పత్తి 2024--25 ఆర్థిక సంవత్సరంలో 65.90 మిలియన్ యూని ట్లుగా ఉండగా, 2025--26లో సుమారు 76.46 మిలియన్ యూనిట్లకు చేరిందని అధికారులు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి రోజు వారీ సగటు ఉత్పత్తి 90.97 మిలియన్ యూనిట్లకు పెరిగిందని తెలిపారు. ప్రస్తు తం సాధిస్తున్న ఉత్పత్తిని మరింత పెంచి రోజుకు 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని భట్టి ఆదేశించారు.

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం సూచి ంచారు. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్ కు అనుసంధానించినట్లు తెలిపారు. సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను యుద్ధ ప్రాతి పదికన పరిష్కరించి, ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలా పాల్లోకి తీసు కొచ్చేందుకు చర్యలు చేపడుతు న్నట్లు వెల్లడించారు. యాదాద్రి ప్లాంట్‌లోని రెండు యూని ట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యా మ్నాయ బొగ్గు సరఫరా మార్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల పరిష్కా రానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిత్తల్, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తాని యా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్‌జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి. పాటిల్, ఆర్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ పాల్గొన్నారు.



ఏఐ ఆవిష్కరణల్లో
జెన్‌జీదే కీలకపాత్ర

- గ్రీన్ స్కిల్స్--అప్లైడ్ ఏఐ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు
- తొలిరోజే 100 ఉద్యోగ ఆఫర్లు.. యువత కోసం ఏఐ ఫర్ మై సిటీ చాలెంజ్

హైదరాబాద్ : కృత్రిమ మేధ (ఏఐ), పర్యావరణహిత ఆవిష్కరణల్లో జెన్‌జీ తరం కీలకపాత్ర పోషించనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సాంకేతికతను వ్యాపారాభివృద్ధికే పరిమితం చేయకుండా ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యల పరిష్కారానికి వినియోగించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో గ్రీన్ స్కిల్స్ అండ్ అప్లైడ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆయన ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్, 1ఎం1బీ, మైటీ స్టార్టప్ హబ్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్లైడ్ ఏఐ, గ్రీన్ ఫార్మా, సౌరశక్తి, విద్యుత్ వాహనాలు, పవన విద్యుత్ రంగాల్లో పట్టభద్రులకు శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా 1ఎం1బీ జాబ్స్ ఎక్స్‌ప్రెస్ ద్వారా తొలిరోజే 100 ఉద్యోగ ఆఫర్లను ప్రకటించారు. సహజవనరుల లభ్యత, నాణ్యత భవిష్యత్ తరాలకూ అందేలా యువత ఇప్పటి నుంచే సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. నగరాల సమస్యలకు యువత ఏఐ ఆధారిత పరిష్కారాలు రూపొందించేలా ఏఐ ఫర్ మై సిటీ చాలెంజ్‌ను ఆయన ప్రారంభించారు.

పరిశ్రమలతో అనుసంధానం కోసం 1ఎం1బీ ఎనిమిది సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని.. 2030 నాటికి దేశవ్యాప్తంగా ఐదు కేంద్రాల ద్వారా లక్ష మందికి ఏఐ, హరిత నైపుణ్యాల్లో శిక్షణ అందించాలనేది లక్ష్యమని ఫౌండేషన్ వ్యవస్థాపకులు మానవ్ సుబోధ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ ఎండీ రాజీవ్ కుమార్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, యువ ఆవిష్కర్తలు పాల్గొన్నారు.

హద్దుమీరుతున్న చైనా

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ వెంట చైనా దురాక్ర మణలకు పాల్పడుతున్నదని, మన సైన్యం దీటుగా బదులిస్తున్నదన్నారు. గల్వాన్ ఘర్షణలు అప్పట్లో తీవ్ర కలకలం సృష్టించాయి. 20 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత పరిస్థితి సద్దుమణిగిందని భావించినప్పటికీ ఇంకా ఘర్షణలు కొనసాగుతున్నాయని డీజీ ప్రకటించడం చర్చకు దారితీసింది. మ్యాప్‌లు చూడండి

దీటుగా బదులిస్తున్నాం..

ఐటీబీపీ సిబ్బందికి ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో డీజీ శత్రుజీత్ కపూర్ మాట్లాడారు. అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో చైనా సైన్యం హద్దుమీరుతున్నదని, ఐటీబీపీకి చెందిన మన శౌర్య కమాండోలు గట్టిగా సమాధానం చెప్తున్నారని ఆయన వివరించారు. 'గత కొన్ని రోజులుగా అరుణాచల్‌లోని పలు ప్రాంతాల్లో చైనాతో ముఖాముఖి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అవి ఇంకా కంటిన్యూ అవు తున్నాయి. ఐటీబీపీకి చెందిన మన శౌర్య కమాండోలు అసాధారణ పోరాట పటిమను ప్రదర్శిస్తున్నారు' అని తెలిపారు. చైనాతో ఉన్న సరిహద్దు మన దేశానికి అత్యంత కఠినమైనదని పేర్కొన్నారు. గల్వాన్ వంటి ఘటనలను ఎదుర్కొనేందుకు, అత్యంత ఎత్తయిన ప్రాంతాల్లోనూ పోరాడేందుకు మన సైన్యానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బార్డర్ యూనిట్లలో డ్రోన్ ప్లటూన్లను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

మోదీ సమాధానం చెప్పాలి: కాంగ్రెస్

ఇండియా చైనా సరిహద్దు వెంట చైనా సైన్యం ఘర్షణలకు దిగుతున్నట్లు ఐటీబీపీ డీజీ ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'చైనాకు క్లీన్‌చిట్లు ఎంత కాలం ఇస్తారు? ఇక చాలు. ఇప్పటికైనా మీరు దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి' అంటూ మూడు ప్రశ్నలను ప్రధాని మోదీకి 'ఎక్స్' వేదికగా ఖర్గే సంధించారు.విశ్వగురువుగా చెప్పుకునే ప్రధాని నరేంద్రమోదీ దేశభద్రతపై మౌనంగా ఉంటున్నారని, చైనాతో పొంచి ఉన్న ముప్పును విస్మరిస్తున్నదని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ కూడా 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ఇప్పటికే లడక్ మాదిరిగానే తామూ పెట్రోలింగ్ పాయింట్లను కోల్పోయామని అరుణాచల్ వాసులు ఆందోళన చెందుతున్నారని, అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు పేర్లను చైనా మారుస్తూనే ఉందని, మన పర్యావరణానికి, నీటికి ఆటంకాలు సృష్టించేలా 60వేల మెగావాట్ల భారీ ప్రాజెక్టును కూడా ఆ దేశం నిర్మిస్తున్నదని ఆయన తెలిపారు.

ప్రధాని మోదీకి ఏఐసీసీ చీఫ్ ఖర్గే ప్రశ్నలు ఇవే..

జాతీయ భద్రత: అరుణాచల్ ప్రదేశ్‌లో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయని సాక్షాత్తు ఐటీబీపీ డీజీ ధ్రువీకరించడాన్ని చూస్తేనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. డోక్లాం, గల్వాన్ తర్వాత మరో ముప్పు పొంచి ఉందా? గత ఆగస్టులో అరుణాచల్‌లోని తాక్సింగ్ సమీపంలో చైనా చొరబాట్లకు ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. తర్వాత చర్చలు జరిగినట్లు చెప్తున్నా ఇంకా ఘర్షణలు కొనసాగడం ఆందోళనకరం. మన దేశ పెట్రోలింగ్ (గస్తీ) మార్గాలకు ఆటంకాలు ఎదురయ్యాయా? భారతదేశంలో అరుణాచల్ ప్రదేశ్ విడదీయరాని భూభాగం. ఇంత జరుగుతున్నా ఎందుకు ప్రధాని మోదీ దాస్తున్నారు? దేశాన్ని ఎందుకు చీకట్లో ఉంచుతున్నారు? ఆర్థిక భద్రత: గల్వాన్‌లో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన తర్వాత కూడా 2020 నుంచి మన దేశానికి చైనా దిగుమతులు 102 శాతం పెరిగాయి. అదే సమయంలో చైనాతో ఇండియా వాణిజ్య లోటు (ట్రేడ్ డిఫిసిట్) 155 శాతం పెరిగి.. 112.16 బిలియన్ డాలర్లకు చేరింది. ఇండియా నుంచి ఎగుమతులకు చైనా ఆటంకాలు సృష్టిస్తున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సైతం అంగీకరిస్తున్నారు. అయినా మోదీ ప్రభుత్వం చైనా పెట్టుబడుల కోసం తలుపులు తెరిచింది. 'మేక్ ఇన్ ఇండియా' అని చెప్తూనే.. 'ఇంపోర్ట్ ఫ్రమ్ చైనా'గా తయారు చేస్తున్నారు. మ్యాప్‌లు చూడండి జవాబుదారీతనం ఏదీ?: కనీసం 23 సార్లు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, భారత ప్రధాని మోదీ మధ్య చర్చలు జరిగాయి. పైగా బ్రిక్స్ వంటి సమావేశాలూ జరిగాయి. ఇంత జరిగితే ఏం సాధించారు? కలిసి ఫొటోలు దిగి పోజులివ్వడం కాదు.. జవాబుదారీతనం కావాలి. మన దళాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఏం జరుగుతున్నదో దేశానికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి.

4 వేల కుటుంబాల
ప్రాణాలతో చెలగాటమాడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వహించాలని స్పష్టం చేశారు. తడి, పొడి చెత్త వేరు చేసి రీసైక్లింగ్ చేసే విధానం ఉన్నప్పటికీ జగిత్యాలలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక యంత్రం ఎందుకు ఆలస్యంగా వస్తోందని నిలదీశారు. నూకపల్లి కాలనీ నిర్వహణకు సంబంధించి ఎవరూ బాధ్యత వహించడం లేదని, కాలనీలో నిత్యం శానిటేషన్ వర్కర్ అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు డంపింగ్ యార్డ్ శాపంగా మారిందని అన్నారు. తక్షణమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే కాలనీ ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పొన్నం.. శబాష్..!

(మొదటి పేజీ తరువాయి)

కృషి చేస్తే ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వల్ల కలిగే కాలుష్యాన్ని సమర్థవంతంగా, స్థిరమైన పద్ధతుల్లో నియంత్రించవచ్చని కేంద్ర మంత్రి తన లేఖలో అభిప్రాయపడ్డారు.గ్రామీణ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు 'స్టీల్ బ్యాంక్' ఒక ఉపయోగకరమైన ఆలోచనగా నిలుస్తుంది. శుభకార్యాల్లో స్టీల్ పాత్రలను తిరిగి వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలనే లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు చేపట్టిన ఈ చొరవ పర్యావరణహిత జీవన విధానాల ప్రోత్సాహానికి దోహదపడనుంది.

అత్యవసర సమయంలో రక్తదానం కటుకం వినయ్ కుమార్

- ఇప్పటివరకు 35 సార్లు రక్తదానం.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న వినయ్ కుమార్

కోరుట్ల అక్టోబర్ 23 ప్రజాతీర్పు



అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలిచారు కోరుట్లకు చెందిన యువ నాయకుడు, సామాజిక సేవకుడు కటుకం వినయ్ కుమార్. కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న హనుమంతు అనే వ్యక్తికి అత్యవసర చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో, కుటుంబ సభ్యులు రక్తదాత కోసం ప్రయత్నించారు.ఈ విషయం తెలుసుకున్న కోరుట్ల పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, బీజేపీ యువ నాయకుడు కటుకం వినయ్ కుమార్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు.అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి తనవంతు సహాయం అందిస్తూ ఇప్పటివరకు 35 సార్లు రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.సమయంతో సంబంధం లేకుండా ఎక్కడ రక్తం అవసరమైనా స్పందిస్తూ రక్తదానం చేస్తున్న వినయ్ కుమార్‌ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్, కోరుట్ల పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం, యువజన సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు ఆకాంక్షించారు.



మేలమడుగులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన.సదస్సు

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 23

మండలం లోని మేలమడుగు గ్రామశీ లో రైతువేదికలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ విజయ ఉప సర్పంచ్ ఈసం శ్రీనివాస్ రావు, , వాలంటీర్స్ ప్రశాంత్ టేకులపల్లి ఏఈవో రెహానా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలు, అనుసరించాల్సిన సాగు పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, ప్రోత్సాహక పథకాలపై రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతం పెరగడంతో పాటు సాగు ఖర్చులు తగ్గి నాణ్యమైన పంటలు పండించే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ఆచరించి సుస్థిర వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని సూచించారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా వైద్య అధికారి తుకారం రాథోడ్

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) అక్టోబర్ 23

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ శుక్రవారం టేకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్సీ) ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీల ప్రసవ అంచనా తేదీల (ఈడిడి) క్యాలెండర్, ఔట్ పేషెంట్ (ఓపి) రిజిస్టర్లు, సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణను సమీక్షించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణీల ప్రసవ అంచనా తేదీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలనిసూచించారు.ఆసుపత్రిలోని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ ఆకస్మిక సందర్శనలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుందర్ పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెంగాని నర్సింహులుకు పద్మా దేవేందర్‌రెడ్డి పరామర్శ

ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

మెదక్, అక్టోబర్ 23 (ప్రజా తీర్పు ప్రతినిధి)



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెదక్ పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మెంగాని. విజయలక్ష్మి భర్త మెంగాని నర్సింహులును మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. నర్సింహులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఎక్స్‌రే నివేదికలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నర్సింహులు త్వరగా కోలుకుని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, మనోధైర్యంతో ఉండాలని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు ప్రభు రెడ్డి, లింగారెడ్డి, ఆర్కే శ్రీనివాస్, రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన.. ఎస్పీ మహేష్ బి. గితే.

(బుగ్గకృష్ణమూర్తిశర్మ ప్రజాతీర్పు సిరిసిల్ల) అక్టోబర్ 23



పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థినీ, విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పోలీస్ విధులపై ప్రత్యక్ష అవగాహన.

ఓపెన్ హౌస్‌లో భాగంగా పోలీస్ శాఖకు చెందిన వివిధ విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. పోలీసులు నిర్వహించే పగలు, రాత్రి గస్తీ, పెట్రోలింగ్, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు న్యాయం అందించేందుకు తీసుకునే చర్యలను వివరించారు. నేరస్తులను గుర్తించేందుకు వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాల పనితీరును ప్రదర్శించారు. నేరాల నివారణతోపాటు, నేరాలను త్వరగా ఛేదించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేశారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను వివరించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించడం, బ్లాక్ చేయడం, తిరిగి పొందడంలో సీఈఐఆర్ వ్యవస్థ ఉపయోగాలను తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్ విధులు, పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసే విధానం, పోలీస్ జాగిలాల సేవలపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.

విద్యార్థులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్, భరోసా కేంద్రం, షీ టీమ్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ స్క్వాడ్, కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది పాల్గొని పోలీస్ శాఖ విధులు, ప్రజల రక్షణ కోసం చేపడుతున్న చర్యలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గణేష్, అనిల్, రంజిత్, ఆర్ఎస్ఐ సాయికిరణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యపై కమిషనర్‌తో మాట్లాడిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి...

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 23.



నూకపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో తీవ్రరూపం దాల్చిన డంపింగ్ యార్డ్ సమస్యపై మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కమిషనర్‌ను డిమాండ్ చేశారు. కాలుష్యంతో అస్వస్థతతో నిన్నటి నుంచి డంపింగ్ యార్డ్‌లో విపరీతంగా మంటలు ఎగిసిపడటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పొగ వల్ల ఇప్పటికే 4 నుండి 5 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారని తెలిపారు. రీసైక్లింగ్ విధానం ఏది?: తడి-పొడి చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేయడానికి ప్రత్యేక వ్యవస్థ ఉన్నప్పటికీ, జగిత్యాలలో ఆ విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 10 వేల మంది జనాభా రక్షణ బాధ్యత: కాలనీలో దాదాపు 4,000 కుటుంబాలు -- అంటే 10,000 మందికి పైగా జనాభా నివసిస్తున్నారని, వారి ఆరోగ్యం ముఖ్యం కాబట్టి అధికారులు బాధ్యత వహించాలని సూచించారు. పరిశుభ్రత లోపం: రెవెన్యూ శాఖ మంత్రి గారు కాలనీకి వచ్చి వెళ్లిన తర్వాతైనా మున్సిపాలిటీ బాధ్యత, సేవలు మెరుగుపడాలని అభిప్రాయపడ్డారు. అగ్నిమాపక చర్యలు సున్యం: ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఫైర్ యాక్సిడెంటా లేక ఎవరైనా కావాలని తగులబెట్టారా అనే దాంతో సంబంధం లేకుండా, వెంటనే అక్కడికి ఫైర్ ఇంజన్ ఎందుకు రావడం లేదని నిలదీశారు. బాధ్యుల కొరత: నూకపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి సంబంధించి బాధ్యత వహించే నిర్దిష్టమైన రెస్పాన్సిబుల్ పర్సన్ ఎవరూ లేకపోవడం శోచనీయమన్నారు. శాశ్వత శానిటేషన్ వర్కర్ అవసరం: కాలనీలో నిరంతరం శుభ్రత పర్యవేక్షించేందుకు ఎల్లప్పుడూ ఒక శానిటేషన్ వర్కర్ అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆందోళన -- తక్షణ పరిష్కారానికి డిమాండ్:

కాలనీ వాసులు ఇప్పటికే తాగునీరు, శానిటేషన్ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి తోడు డంపింగ్ యార్డ్ పెద్ద సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను త్వరితగతిన ఏ విధంగా పరిష్కరిస్తారో స్పష్టం చేయాలని, లేనిపక్షంలో విసిగిపోయిన కాలనీ ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని హెచ్చరించారు.

బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా నక్క శివకుమార్ నియామకం

శేరిలింగంపల్లి, అక్టోబరు 23 ప్రజా తీర్పు



భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా నక్క శివకుమార్ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రంగారెడ్డి జిల్లా యువ మోర్చా అధ్యక్షులు శ్రీ సాయిరాం గౌడ్ గారికి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీ వానేపల్లి శ్రీనివాస్ రెడ్డి గారికి నక్క శివకుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పని చేస్తానని ఆయన తెలిపారు.



ఉపాధి హామీ, జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలి:

జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్...

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 23.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలని, జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఉపాధి హామీ, జల సంరక్షణ, ఇందిరమ్మ ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు తదితర సంక్షేమ, అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

సమీక్షలో కలెక్టర్ సూచించిన ముఖ్యాంశాలు:

- ఉపాధి హామీ పనుల విస్తరణ: ప్రతి గ్రామంలో సగటున 45 మంది కూలీలకు పనులు కల్పించాలని, కాలువల పూడికతీత వంటి సామూహిక పనులను పెంచి పనుల షెల్ఫ్‌ను 200 శాతానికి తీసుకెళ్లాలని సూచించారు.
- ఫార్మ్ పాండ్స్ ఁ జల సంరక్షణ: మిగిలిన ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని రానున్న రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాజిక్ సోక్‌పిట్స్, కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసి అక్టోబర్ 31 నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
- వ్యక్తిగత మరుగుదొడ్లు పెండింగ్‌లో ఉన్న 918 మరుగుదొడ్ల మంజూరును డీఆర్‌డీఏ, హౌసింగ్ అధికారులు సమన్వయంతో వెంటనే పూర్తి చేయాలన్నారు.
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం: మొదటి విడతలో మిగిలిన 860 ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, మంజూరైన ఇళ్ల నిర్మాణ వేగాన్ని పెంచాలని సూచించారు. అలాగే రెండో విడత ఇళ్ల ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు. లక్ష్యాలను గడువులోగా సాధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డిప్యూటీ సీఈఓ నరేష్, హౌసింగ్ పీడీ, ఎంపీడీవోలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ ను ఎవరూ కాపాడలేరు.. వేలాదిమందితో ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన

ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, వామపక్షాల ప్రతినిధులు సహా వేలాదిమంది శుక్రవారం భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీ నిర్వహించారు. అశోకా రోడ్డులోని ఈసీఐ ప్రధాన కార్యాలయానికి కొన్ని వందల మీటర్ల దూరంలో ఉన్న బంగ్లా సాహిబ్ గురుద్వారా సమీపంలో బహుళ అంచెల బారికేడ్లను ఛేదించేందుకు ప్రయత్నించిన 100 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు.. సవరన్ మసీదులో సీపీ గౌష్ ఆలం ప్రత్యేక ప్రార్థనలు

- అమరవీరుల ఆత్మశాంతి, కుటుంబాల సంక్షేమం కోసం దువా

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 23



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం స్థానిక సవరన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో విధి నిర్వహణ చేస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేమం, వారి కుటుంబాల సంక్షేమం, ప్రజల శాంతి సౌభాగ్యాల కోసం ప్రత్యేక దువా నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు మనోధైర్యం, శాంతి కలగాలని ప్రార్థనలు చేశారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: సీపీ

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం వారు చేసిన సేవలు పోలీస్ శాఖకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి సేవలను స్మరించుకోవడంతో పాటు, పోలీసుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేసే ముఖ్యమైన సందర్భమని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో పాటు ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, విజయకుమార్, టౌన్, ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ప్రజా సంఘాల నిరసన.. దిష్టిబొమ్మ దహనం

(ఇమ్రాన్ జోహ్రి, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 23



కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఓటరు జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ పనితీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. ఓటరు జాబితా నుంచి అర్హులైన పౌరుల పేర్లను తొలగించడం వారి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకతను పాటించాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కును పరిరక్షించాలి

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని వర్ణ వెంకటరెడ్డి అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని, దానిని నిలిపివేసి సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయాలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, అర్హులైన పౌరులకు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని అన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషన్‌పై విమర్శలు

ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని వర్ణ వెంకటరెడ్డి ఆరోపించారు. ఓటరు జాబితాల సవరణ ద్వారా ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారంటూ విమర్శలు చేశారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లు తొలగించబడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా తన బాధ్యతలను నిర్వర్తించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలిపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలను పాటిస్తూ, అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలి

ఓటు హక్కు పరిరక్షణ కోసం న్యాయవ్యవస్థ జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వర్ణ వెంకటరెడ్డి కోరారు. ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించే ప్రక్రియలో అర్హులైన పౌరులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటు హక్కును కాపాడేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు, మేధావులు, అభ్యుదయ, ప్రగతిశీల శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడంతో పాటు, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చే వరకు తమ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు.

ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వాసుదేవరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుంకర సంపత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి జి. భీమా సాహెబ్, ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, జిల్లా నాయకులు రాయికంటి శ్రీనివాస్, ఎడ్ల రమేష్, సురేష్, రవి, రాజు, కే. ప్రభాకర్, జె. శంకరయ్య, సంతోష్, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి.. తొలగించిన ఓట్లను మళ్లీ చేర్చాలి

సుజాతనగర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23 ప్రజా తీర్పు

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, తొలగించిన ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల పిలుపు మేరకు సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. సీఐటీయూ, రైతు సంఘం, కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం సరికాదని పేర్కొన్నారు. తొలగించిన ఓట్లను వెంటనే తిరిగి చేర్చాలని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వీర్ల రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి బచ్చలకూర శ్రీనివాసరావు, రైతు సంఘం అధ్యక్షులు నల్లగోపు పుల్లయ్య, కొండే కృష్ణ, కేవీపీఎస్ నాయకులు మురిపిటి నాగేష్, సీపీఎం నాయకులు చింతలపూడి సాయి, మంచాల శ్రీను, సీఐటీయూ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి, సింతాల శ్రీను, గోసుల సురేష్, పూనెం శంకర్, గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మద్దతు

- ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. సమ్మె శిబిరంలో సంఘీభావం

(జక్కుల శ్రీకాంత్, కరీంనగర్, ప్రజా తీర్పు ప్రతినిధి) అక్టోబరు 23

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కరీంనగర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు సుంకె రవిశంకర్ మద్దతు తెలిపారు. శుక్రవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, వేతనాలు పెంచాలని కోరారు. ప్రజారోగ్య వ్యవస్థలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిరంతరం శ్రమిస్తున్నారని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మెకు మద్దతుగా నిలిచి సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఎన్‌హెచ్ఎం జేఏసీ కరీంనగర్ జిల్లా కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

త్రివిధ దళాల సమన్వయంలో సీడీఎస్ కీలక భూమిక

- కె.ఎస్.పి.పి. ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న నితిన్ ఎ. గోఖలే

పటాన్ చేరు, అక్టోబరు 23 ప్రజాతీర్పు ప్రతినిధి



భారతదేశ రక్షణ రంగంలోని త్రివిధ దళాలను సమన్వయం చేయడంతో పాటు ప్రభుత్వానికి ఏకోన్ముఖంగా సైనిక సలహాలు ఇవ్వడం, దళాల నైపుణ్యాన్ని పెంపొందించడంలో త్రివిధ దళాధిపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ -- సీడీఎస్) కీలక భూమిక పోషిస్తున్నారని భారత్ శక్తి గ్రూపు వ్యవస్థాపకుడు, ఎడిటర్-ఇన్-చీఫ్ నితిన్ ఎ. గోఖలే అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి)లో 'రేపటి యుద్ధాలకు సన్నద్ధం: త్రివిధ దళాల నుంచి ఒకే పోరాట శక్తిగా' అనే అంశంపై శుక్రవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు

గోఖలే భారతదేశ ఉన్నత రక్షణ వ్యవస్థ పరిణామక్రమాన్ని వివరిస్తూ, లార్డ్ ఇస్మే ప్రతిపాదించిన మూడు అంచెల నిర్మాణం, జాతీయ భద్రతా దళం (ఎన్.ఎస్.జీ) ఏర్పాటు గురించి చర్చించారు. కార్గిల్ సమీక్షా కమిటీ సిఫార్సులు, సీడీఎస్ ఏర్పాటుకు సంబంధించి 2019 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనతో సహా రక్షణ సంస్కరణలలోని కీలక మైలురాళ్లను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. 2020 జనవరి 1న భారతదేశపు మొట్టమొదటి సీడీఎస్ నియామకం, సైనిక వ్యవహారాల శాఖ (డీఎంఏ) ఏర్పాటు గురించిన వివరాలను కూడా తెలియజేశారు. సీడీఎస్ పాత్ర గురించి, చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీఓఎస్సీ) అధ్యక్షునిగా, డీఎంఏ కార్యదర్శిగా, త్రివిధ దళాల అధిపతిగా సీడీఎస్ బాధ్యతలను గోఖలే వివరించారు. ఈ సంస్థాగత మార్పులు, సాయుధ దళాల మధ్య త్రివిధ దళాల ఏకీకరణ (థియేటరైజేషన్), అధిక కార్యాచరణ సమన్వయానికి పునాది వేశాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఉపన్యాసం రక్షణ పరివర్తనలోని కీలక రంగాలను పరిశీలించింది. వాటిలో పోరాట సామర్థ్యాన్ని పెంచడం, మానవశక్తి, వనరులను ఉత్తమంగా వినియోగించుకోవడం, ఆధునీకరణ, స్వదేశీకరణ, మానవ వనరుల సంస్కరణలు, సాయుధ దళాలలో మహిళల భాగస్వామ్యం, వలసవాద వారసత్వాలను పరిష్కరించడం, జాతీయ భద్రతా ప్రయత్నాలను బలోపేతం చేయడం వంటి ఉన్నాయి. త్రివిధ దళాల ప్రధాన కార్యాలయాలలో తేడాలు, కార్యాచరణ అవసరాలు, సైనిక, పౌర పరిపాలనా నిర్మాణాల సమన్వయం వంటి ఏకీకరణకు ఎదురయ్యే ఆచరణాత్మక, సంస్థాగత సవాళ్లను కూడా గోఖలే ప్రస్తావించారు త్రివిధ దళాలు ఏకోన్ముఖంగా ముందుకెళ్లే మార్గాన్ని గోఖలే వివరిస్తూ, సమీకృత థియేటర్ కమాండ్లను స్థాపించడం, వాయు రక్షణ, సంయుక్త కమాండ్ నిర్మాణాలను ఏకీకృతం చేసి కార్యాచరణలోకి తీసుకురావడం, 2047 నాటికి సాయుధ దళాల కోసం ఒక దీర్ఘకాలిక దార్శనికతను అభివృద్ధి చేయడం, సంయుక్త సిద్ధాంతాలను రూపొందించడం, త్రివిధ దళాలకు ఆదేశాలు, సూచనలు జారీ చేయడం, సంబంధిత ఏజెన్సీలను విస్తరించడం వంటి వాటి ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. భారతదేశ ఉన్నత రక్షణ సంస్థపై ఆపరేషన్ సింధూర్ ప్రభావాలను, చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ యొక్క కేంద్రీకృత పాత్రను గోఖలే విశదీకరించారు. సీడీఎస్ వ్యవస్థలోని లోటుపాట్లను విశ్లేషిస్తూ, డొమైన్ నైపుణ్యం, ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యాన్ని కీలక బలాలుగా ఆయన గుర్తించారు. నేర్చుకోవలసిన విషయాలు, సంస్థాగత పక్షపాతాలు, పరిపాలనా పనిభారం వంటివి బలహీనతలుగా విశ్లేషించారు. విధాన నిర్ణయాలలో మరింత సన్నిహిత భాగస్వామ్యం, తక్కువ సమయం వల్ల తలెత్తే అవకాశాలలతో పాటు, వివిధ సేవల మధ్య సమన్వయం, సంస్థాగత సహకారాన్ని బలోపేతం ఆవశ్యకతను ఆయన ప్రస్తావించారు. ఉపన్యాసం ముగిశాక నిర్వహించిన ముఖాముఖిలో గోఖలే, విధాన రంగ నిపుణులుగా ఎదగాలనుకుంటున్న ఔత్సాహిక విద్యార్థులతో సంభాషించి, వారి ప్రశ్నలకు ఓపికగా సమాధానమిచ్చారు. కె.ఎస్.పి.పి. డీన్, ఐక్యరాజ్య సమితిలో భారతదేశ మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ కూడా ఈ ఉపన్యాస కార్యక్రమానికి హాజరయ్యారు.



శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మొక్కల పెంపకానికి శ్రీకారం

మంథని, అక్టోబర్ 23 (ప్రజాతీర్పు)

మంథని పట్టణంలో కొలువై ఉన్న అత్యంత మహిమాన్వితమైన శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయం భక్తుల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది. తనను నమ్మి కొలిచే భక్తుల పాలిట కొంగుబంగారంగా, కల్పవృక్షంగా, కామధేనువుగా నిలిచి కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తులు శ్రీరేణుకా ఎల్లమ్మను పూజిస్తుంటారు. స్థానిక నాయకుల సహకారంతో గౌడ భక్తులు ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించగా, ప్రతిరోజూ నిత్య ధూపదీప నైవేద్యాలతో పాటు ముఖ్యమైన పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గౌడ భక్తులే కాకుండా, అమ్మవారిని నమ్మే ఇతర కులాల భక్తులు సైతం ఆలయానికి వచ్చి పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారి అనుగ్రహంతో తమ కోర్కెలు నెరవేరాయని విశ్వసించే భక్తులు ఎందరో ఉన్నారు. ఇటీవల ఈ దేవాలయానికి నూతన కార్యవర్గం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆలయ ప్రాంగణమంతా పూలు, పండ్లు అందించే మొక్కలతో పాటు ఆరోగ్యదాయకమైన చెట్లను నాటేందుకు సహకరించాలని కార్యవర్గాన్ని కోరడం జరిగింది. ఇందుకు కార్యవర్గ సభ్యులు వెంటనే అంగీకరించారు. ఈ క్రమంలోనే ఆలయ ప్రాంగణంలో సుమారు 30 నుంచి 40 మొక్కలు నాటేందుకు పనులు ప్రారంభించారు. ఆలయ పరిసరాలను పచ్చదనంతో నింపడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ఆలయ ప్రాంగణం పచ్చదనంతో విరాజిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



క్రీడాకారిణిని అభినందించిన కేటీఆర్

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజా తీర్పు) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 23

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన ఓ క్రీడాకారిణినిబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గూడెపు వంశిక జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వంశికను ప్రత్యేకంగా అభినందించి, జాతీయ స్థాయిలోనూ అద్భుత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

కెప్టెన్‌గా జట్టును సెమీఫైనల్‌కు చేర్చిన వంశిక.

అక్టోబర్ 10 నుంచి 13 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వంశిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలతో కూడిన ఉమ్మడి జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమె, తన నాయకత్వ ప్రతిభతో జట్టును సెమీఫైనల్స్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించింది. బౌలింగ్‌లోనూ సత్తా చాటి పలువురి ప్రశంసలు అందుకుంది.

జమ్మూ కాశ్మీర్‌లో జాతీయ స్థాయి పోటీలు.

వచ్చే నవంబర్ మొదటి వారంలో జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో వంశిక తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదువుకుంటూ జాతీయ స్థాయికి ఎంపిక కావడం నామాపూర్ గ్రామానికి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. వంశిక విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కుంట శ్రీనివాస్‌తో పాటు ప్రోత్సాహం అందించిన పాఠశాల ఉపాధ్యాయులను పలువురు అభినందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనేందుకు వంశిక విజయం నిదర్శనంగా నిలుస్తోంది. జాతీయ స్థాయి పోటీల్లోనూ ఆమె విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.



ఘనంగా రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

పాపన్నపేట/మెదక్, అక్టోబర్ 23 (ప్రజా తీర్పు ప్రతినిధి):

ఏడుపాయలలో నిజాంపేట మండలం వెంకటాపూర్ ఆర్ బిఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి హాజరై రాజిరెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట సర్పంచ్ అందె కొండల్ రెడ్డి, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాల గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యరెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి నాయకులు మావురం రాజు, నాగరాజు, నర్సారెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.

దొంతి కాంతమ్మ సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొన్న నర్సంపేట మున్సిపల్ 4thవార్డ్ కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి

నర్సంపేట అక్టోబర్ 23 ప్రజా తీర్పు ప్రతినిధి కృష్ణ



మా అభిమాన నాయకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దలు దొంతి మాధవరెడ్డి తల్లిగారు దొంతి కాంతమ్మ మొదటి సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొని దొంతి కాంతమ్మ చిత్రపటం వద్ద పువ్వులను వేసి నివాళి అర్పించిన నర్సంపేట మున్సిపల్ కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ నాలుగో వార్డ్ అధ్యక్షులు మంచినీళ్ల నాగరాజు కాంగ్రెస్ నాయకులు ముత్యాల రేవంత్ ఎండి ఆదిల్ పాల్గొన్నారు.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వ తీరు

- ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యల్లో విఫలం.. ఎండిపోతున్న పంటలను కాపాడి రైతులకు పరిహారం అందించాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి: తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్)

అక్టోబర్ 23



కరీంనగర్: ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో, రైతులకు మరియు ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ విమర్శించారు. సమస్యలు తీవ్రమైన తర్వాత ప్రజలకు సూచనలు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. ఎండిపోతున్న పంటలను తక్షణమే పరిశీలించి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని, తాగునీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరిప్రసాద్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులపై నిపుణులు హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమై ఉండాల్సిందని అన్నారు. నీటి వినియోగంపై ప్రజలకు సూచనలు చేయడంతో పాటు, అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థవంతంగా వినియోగించుకునే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలి

రానున్న రోజుల్లో నీటి కొరత తీవ్రతరమయ్యే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో తాగునీరు, సాగునీటి నిర్వహణపై ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలని హరిప్రసాద్ కోరారు. గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నీటిని నిల్వ చేసుకునే అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఉంటే రైతులకు ప్రయోజనం కలిగేదని అన్నారు. అందుబాటులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను సమర్థవంతంగా వినియోగించి, నీటి నిల్వలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూనే, వ్యవసాయానికి అవసరమైన నీటి నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలి

తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కరీంనగర్ సమీపంలోని మొగ్దంపూర్ గ్రామాన్ని సందర్శించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారని హరిప్రసాద్ తెలిపారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు ముందుగానే క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని గుర్తించలేకపోయారని విమర్శించారు. కవిత పర్యటన అనంతరం అధికారులు పంట పొలాలను సందర్శించి పరిస్థితిని అంచనా వేయడం ప్రారంభించారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించి, ఎండిపోతున్న పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. నష్ట వివరాలతో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించి, అర్హులైన రైతులకు సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు ముందస్తు సూచనలు అందించాలని, నీటిని పొదుపుగా వినియోగించే విధానాలపై అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా పంటల పరిస్థితిని సమీక్షించి, రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పర్యటనలు అవసరం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని హరిప్రసాద్ కోరారు. జిల్లా అధికారులు గ్రామాలు, మండలాల్లో పర్యటిస్తే కింది స్థాయి అధికారులు కూడా అప్రమత్తమై ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతారని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. తాగునీరు, వ్యవసాయం, వైద్యం, పారిశుద్ధ్యం, రహదారులు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలి

కరీంనగర్ జిల్లాలో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరిప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో కొందరు రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని విమర్శించారు. జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాలని, శస్త్రచికిత్సలకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

డంపింగ్ యార్డు సమస్యపై దృష్టి సారించాలి

కరీంనగర్ నగరంలో డంపింగ్ యార్డు సమస్య కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని హరిప్రసాద్ కోరారు. డంపింగ్ యార్డు నిర్వహణ, చెత్త తొలగింపు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థలో డీజిల్ వినియోగానికి సంబంధించి వచ్చిన ఆరోపణలపై పారదర్శకంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజాధన వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలి

గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు రహదారి నిర్మాణం చేపట్టాలన్న ప్రజల డిమాండ్‌ను అధికారులు పరిశీలించాలని హరిప్రసాద్ కోరారు. అలాగే మానకొండూరు నుంచి జమ్మికుంట వరకు ఉన్న రహదారిలో కల్వర్టులకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం, మెరుగైన విద్య, రైతులకు సాగునీరు వంటి ప్రాథమిక అవసరాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించడంతో పాటు తాగునీటి కొరత నివారణకు సమగ్ర నీటి నిర్వహణ ప్రణాళిక రూపొందించాలని హరిప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఎండిపోతున్న పంట పొలాలను తక్షణమే పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేసి అర్హులైన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, రైతులు మరియు సామాన్య ప్రజలకు అవసరమైన సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పార్టీ నాయకులు పాల్గొన్నారు

ఈ విలేకరుల సమావేశంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం శివరాణి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి సంగీత రెడ్డి, కార్యదర్శి పూదరి రాజేశ్వరి గౌడ్, నగర అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, కరీంనగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బశెట్టి కృష్ణవేణి, జిల్లా పార్టీ నాయకులు మ్యాకల తిరుపతి, చంటి శ్రీనివాస్, బసవేణి రాజేందర్, గర్షకుర్తి విద్యాసాగర్, పుల్ల మల్లేషం, అభినవ్ రెడ్డి, లక్కరసు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కానిస్టేబుల్ రవిని పరామర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

కుటుంబానికి 25 వేల ఆర్థిక సాయం అందజేత

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) అక్టోబర్ 23



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ గురువారం రాత్రి టేకులపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ ను కొత్తగూడెంలోని వరుణ్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 2009 బ్యాచ్ కానిస్టేబుల్ పులసం రవి ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా రవి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.25,000 అందజేశారు. టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ వారి వెంట ఉన్నారు.



దొంతి కాంతమ్మ సంవత్సరికంలో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్

నర్సంపేట అక్టోబర్ 23 ప్రజా తీర్పు ప్రతినిధి కృష్ణ

మా అభిమాన నాయకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దలు దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ మొదటి సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొని దొంతి కాంతమ్మ చిత్రపటం వద్ద పువ్వులను వేసి నివాళి అర్పించిన తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, కౌన్సిలర్లు బత్తిని రాజేందర్, మాదాసి రవి, కొత్తకొండ మేఘన శ్యామ్ రాజ్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, కోనాపురం సర్పంచ్ మైదం రాకేష్, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి చిప్ప నాగ, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంత రంజిత్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, వార్డు అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల చరణ్ గౌడ్, ఉడ్గుల రాంబాబు, బిట్ల మనోహర్, గోక వేద ప్రకాష్, కాట రాహుల్, బండి సందీప్, ఉప్పుల షాలోమ్, చీకటి శివమణి పాల్గొన్నారు..

విద్యుత్ నగర్ లో అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న కాట సునీత

పఠాన్ చెరు అక్టోబర్ 23 ప్రజా తీర్పు



న్యూ ఎంఐజి విద్యుత్ నగర్ లో నిర్వహించిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు కాట సునీత గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, భక్తులతో కలిసి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల హక్కుల పరిరక్షణకు ప్రజాసంఘాల నిరసన

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్.. దిష్టిబొమ్మ దహనం

(జక్కుల శ్రీకాంత్, ప్రజా తీర్పు ప్రతినిధి) అక్టోబర్ 23

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఓటరు జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి అర్హులైన ఓటర్లందరి పేర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన పౌరుల ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు, మేధావులు, అభ్యుదయవాదులు భవిష్యత్తులో జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వాసుదేవరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుంకర సంపత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి జి. బీమా సాహెబ్, ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మంథని బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వినతిపత్రం

మంథని, అక్టోబర్ 23 (ప్రజాతీర్పు)

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి, నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఎండీ వై. నాగిరెడ్డికి మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యుడు ఎల్లెంకి వంశీధర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు రోడ్డు విస్తరణలో భాగంగా చిరు వ్యాపారులకు సంబంధించిన దుకాణాలు తొలగించాల్సి వస్తున్న నేపథ్యంలో, ఆయా వ్యాపారులకు తిరిగి ఉపాధి కల్పించేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని మంత్రులు, ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకోసం ఆర్టీసీ బస్టాండ్‌కు సంబంధించిన కొంత స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మంథని పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణికులు, వ్యాపారులు, పట్టణ ప్రజలకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వివరించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోతున్న చిరు వ్యాపారులకు తిరిగి దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం లభించడంతో పాటు, స్థానిక వాణిజ్య అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడుతుందని తెలిపారు. మంథని పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు, అనుమతులు, నిధుల మంజూరు తదితర అంశాలను పరిశీలించి, నిర్మాణ పనులు చేపట్టేందుకు సహకరించాలని వారు కోరారు. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, స్థానిక చిరు వ్యాపారులకు, పట్టణ ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- అక్టోబర్ 26న 'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

మెదక్ అక్టోబర్ 23 (ప్రజా తీర్పు ప్రతినిధి)



కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.30 వేలకు పెంచాలని, రెండో పీఆర్సీని ప్రకటించి డీఏ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 26న 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మెదక్ మున్సిపల్ కమిటీ అధికారులకు, వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.రాష్ట్రవ్యాప్తంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సుమారు 60 వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని వారు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ చాలామందికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, అర్హతకు తగిన పదోన్నతులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనుల్లో రక్షణ పరికరాలు, సరైన వైద్య సదుపాయాలు లేక కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రమాదాల్లో మరణించిన వారికి తగిన పరిహారం అందడం లేదని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో కార్మికుల కాలనీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా హామీలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయడం, రెండో పీఆర్సీని ప్రకటించడం, కనీస వేతనాన్ని రూ.30,000గా నిర్ణయించడం, డీఏ వర్తింపజేయడం, జీవో నంబర్ 1181ను రద్దు చేయడం వంటి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని. వయోభారం, అనారోగ్యం, ప్రమాదాలు లేదా మరణాల కారణంగా విధులకు దూరమైన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, పట్టణాల విస్తరణకు అనుగుణంగా కొత్త సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 26న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త 'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలని అయిన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మెదక్ జిల్లా కార్యదర్శి నాగరాజు. ఏసు రోజా.మహేష్. బాల ఎల్లం.లక్ష్మి. తదితరులు పాల్గొన్నారు.

ఒకవైపు కూల్చివేతలు.. మరోవైపు మళ్లీ నిర్మాణాలు!

- గాయత్రి హిల్స్‌లో పాత షెడ్ మళ్లీ ప్రారంభం.. రాజశేఖర్ కాలనీలో మరో భారీ షెడ్ ఒక వైపు నిర్మాణం!
- కూల్చినా ఆగని అక్రమ నిర్మాణాలు!
- అక్రమ షెడ్లకు అధికారుల మౌనమే అనుమతా?.
- కూల్చిన చోటే మళ్లీ కట్టడం.. ఇదెక్కడి న్యాయం?.
- బోడుప్పల్‌లో అక్రమ నిర్మాణాల జోరు.. అధికారుల తీరు బేజారు!.

మేడిపల్లి, అక్టోబర్ 23 (ప్రజాతీర్పు):





బోడుప్పల్ సర్కిల్ పరిధిలో నిర్మాణాల వ్యవహారం సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో రోజురోజుకూ భారీ షెడ్ల నిర్మాణాలు పెరుగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమే అక్రమ నిర్మాణదారులకు వరంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిన్న కూల్చివేత.. నేడు మళ్లీ నిర్మాణం!

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని గాయత్రి హిల్స్ కాలనీలో నెల రోజుల క్రితం భారీ షెడ్ నిర్మాణాన్ని సంబంధిత అధికారులు తొలగించారు. అయితే అదే స్థలంలో తిరిగి షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో నిబంధనలకు విరుద్ధమని తొలగించిన నిర్మాణం ఇప్పుడు మళ్లీ ఎలా చేపడుతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సదరు నిర్మాణానికి తాజాగా ఏమైనా అనుమతులు మంజూరు చేశారా? లేక అధికారుల పర్యవేక్షణ లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రాజశేఖర్ కాలనీ కమాన్ ఎదురుగా మరో భారీ షెడ్!

ఇదిలా ఉండగా రాజశేఖర్ కాలనీ కమాన్ ఎదురుగా మరో భారీ షెడ్ నిర్మాణం చేపడుతుండటంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనావాసాల మధ్య ఇటువంటి భారీ నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో స్థానికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? అనే విషయాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.

అధికారుల మౌనంపై అనుమానాలు!

ఒకవైపు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, మరోవైపు తొలగించిన చోటే తిరిగి నిర్మాణాలు జరుగుతుండటం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిర్మాణాలను తొలగించడంతోనే బాధ్యత ముగిసిందా? మళ్లీ నిర్మాణాలు జరగకుండా పర్యవేక్షించాల్సిన అవసరం లేదా? అని స్థానికులు నిలదీస్తున్నారు. కొందరు అధికారుల అండదండలతోనే ఇలాంటి నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలపై కూడా ఉన్నతాధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ షెడ్లపై ఉక్కుపాదం మోపాలి!

బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భారీ షెడ్లను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా గాయత్రి హిల్స్ కాలనీలో తిరిగి కొనసాగుతున్న నిర్మాణంతో పాటు రాజశేఖర్ కాలనీ కమాన్ ఎదురుగా చేపడుతున్న భారీ షెడ్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే నిర్మాణాలను తొలగించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి బోడుప్పల్ సర్కిల్‌లో జరుగుతున్న భారీ షెడ్ల నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపడతారా? లేక అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోకుండా వదిలేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

- రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్

కరీంనగర్ అక్టోబర్ 23)

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం పత్తి కొనుగోళ్లు, జిన్నింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్, మార్కెట్ కమిటీ సెక్రటరీ, పత్తి కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ మాట్లాడుతూ, ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షించారు. మార్కెట్‌కు పత్తిని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.పత్తి కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగాలని, రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చూడాలని, కొనుగోళ్ల సమయంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పనిచేస్తుందని చైర్మన్ ఆకుల నరసన్న పటేల్ తెలిపారు. పత్తి కొనుగోళ్లు, జిన్నింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ, పత్తి కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్య కళాశాలలో పారదర్శకంగా నియామక ప్రక్రియ

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 23

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, అభ్యర్థుల ప్రతిభ, మెరిట్, అర్హతల ఆధారంగా ఎంపిక చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో దంత వైద్య విభాగంలో అధ్యాపకుల కొరకు నిర్వహించిన నియామక ప్రక్రియకు కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం రాత పరీక్ష, పి.జి. మార్కులు, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని, అభ్యర్థుల విద్యార్హతలు, ప్రతిభ, అనుభవం తదితర అంశాలను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులు సాధించిన మార్కులతో పాటు, పి.జి. మార్కులకు నిర్దేశించిన వెయిటేజీని పరిగణనలోకి తీసుకొని తుది మెరిట్‌ను నిర్ణయించడం జరిగిందని, ఈ ప్రక్రియలో అభిషేక్ అత్యుత్తమ ప్రతిభ కనబరచగా, ఎంపిక చేసేందుకు కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థి త్వరలో విధులలో చేరేలా నియామక ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల మైదానం అభివృద్ధి, క్రీడా వసతుల కల్పన, త్రాగునీటి సదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

టీకాలతోనే చిన్నారులకు పోలియో నుంచి రక్షణ

జక్కుల శ్రీకాంత్ కరీంనగర్, అక్టోబరు 24 (ప్రజా తీర్పు ప్రతినిధి):

ప్రపంచ పోలియో దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబరు 24న నిర్వహిస్తారు. పోలియో వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడం, చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం, వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. పోలియో వైరస్ ప్రధానంగా చిన్నారులపై ప్రభావం చూపి శాశ్వత పక్షవాతానికి దారితీయవచ్చు. ఈ వ్యాధిని నివారించేందుకు టీకాలు కీలక పాత్ర పోషిస్తాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రభుత్వ ఆరోగ్య శాఖ సూచించిన షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలు వేయించాలి. పోలియో టీకా కార్యక్రమాల్లో ఆరోగ్య సిబ్బందికి సహకరించాలి. ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలన దిశగా గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో వైరస్ ముప్పు ఇంకా ఉంది. అందువల్ల ప్రతి చిన్నారికి టీకాలు అందేలా చూడటం, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.



పోతరాజు వెంకటమ్మ మృతికి జర్నలిస్టుల నివాళి

మంథని, అక్టోబర్ 23 (ప్రజాతీర్పు)

ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఆంధ్రజ్యోతి మంథని ఆర్సీ ఇన్‌చార్జి, టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఎథిక్స్ కమిటీ చైర్మన్ పోతరాజు సమ్మయ్య మాతృమూర్తి పోతరాజు వెంకటమ్మ మృతికి టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు శుక్రవారం శ్రద్ధాంజలి ఘటించారు. వెంకటమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ లు ఒక ప్రకటనలో వెంకటమ్మ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



దొంగల గుట్టురట్టు.. 11 బైక్‌లు స్వాధీనం

- బైక్ దొంగల ఆట కట్టించిన మేడిపల్లి పోలీసులు.
- డూప్లికేట్ తాళాలతో వరుస బైక్ చోరీలు,11 కేసులు ఛేదించిన మేడిపల్లి పోలీసులు.
- ఇద్దరు నిందితుల అరెస్ట్..
- బోడుప్పల్ కమాన్ వద్ద పోలీసులకు చిక్కిన నిందితులు.

మేడిపల్లి, అక్టోబర్ 23 (ప్రజాతీర్పు):

ఒకరు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తుంటే.. మరొకరు వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. డూప్లికేట్ తాళాలను ఉపయోగించి వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల ఆటకు మేడిపల్లి పోలీసులు చెక్ పెట్టారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇళ్ల ముందు, పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను నిందితులు లక్ష్యంగా చేసుకున్నారు. డూప్లికేట్ తాళాల సహాయంతో బైక్‌లను చోరీ చేసి, అనంతరం వాటిని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వరుస చోరీలతో అప్రమత్తమైన పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టి బోడుప్పల్ కమాన్ వద్ద అరవింద్ కుమార్ ఉపాధ్యాయ్ అలియాస్ రాజు (56), తుంగ మధు (29)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా పలు ద్విచక్ర వాహనాల చోరీలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. వీరికి సంబంధించి మొత్తం 11 బైక్ చోరీ కేసులను ఛేదించిన పోలీసులు 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.


వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి: పోలీసులు

ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్కింగ్ చేయడంతోపాటు అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, వాహన చోరీలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. వాహన చోరీలను అరికట్టేందుకు నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే దొంతి ని కలిసిన సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్..

నర్సంపేట ఆగస్టు 23 ప్రజా తీర్పు ప్రతినిధి

ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చెన్నారావు పేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ సొసైటీ డైరెక్టర్లతో వారి స్వగృహంలోమర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దొంతి తల్లి మొదటి వర్ధంతి జరుగగా వారి స్వగృహంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ని యువ నేత అవియుక్త్ రెడ్డి ని కలిశారు.. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో ఆవుల రాములు ఇంద్ర రెడ్డి వట్టే తిరుపతి రెడ్డి మహేందర్ రెడ్డి చిప్ప లక్ష్మణ్ సిఈవో రవి ఉప సర్పంచ్ కొర్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు



బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం



(చింతల పెళ్లి వేణు రెడ్డి ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండల రిపోర్టర్) అక్టోబరు 23

బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో జెడ్పీహెచ్ఎస్ (గ్లూమా) పాఠశాల విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరు, విధులు మరియు బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి ఎస్ఐ రమకాంత్ విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలు, శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రతలో పోలీస్ శాఖ పాత్ర గురించి వివరించారు. అలాగే, విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునేలా అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీసుల పట్ల భయం వీడి, ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదించాలని సూచించారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, చట్టాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో మెలగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి ఎస్ఐ రమకాంత్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత

- అర్హులందరికీ న్యాయం చేయడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ అక్టోబర్ 23 రవీందర్ ప్రజా తీర్పు



నియోజకవర్గంలో పూర్తిగా ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న వారికి ముందుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయిస్తోందని పేర్కొన్నారు.గౌరవెల్లి,గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి ఇల్లు పొందని నిర్వాసితుల్లో భూమి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా చిగురుమామిడి, సుందరగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి జనగామ మార్గంలో అక్కన్నపేట మీదుగా రహదారి విస్తరణ తదితర కారణాలతో ఇళ్లు కోల్పోయిన అర్హులైన వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన వారికి అర్హత ఉండి ఇల్లు లేని వారికి కూడా ఇందిరమ్మ ఇల్లు కేటాయించేల చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, రహదారి విస్తరణ కారణంగా నివాసాలను కోల్పోయిన అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అర్హుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, అత్యంత అవసరంలో ఉన్న కుటుంబాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



జవహర్ నగర్ డంపింగ్ యార్డు తరలింపుపై ఈటల రాజేందర్ ఆందోళన బాట పట్టనున్నారు.

- జవహర్ నగర్ డంపింగ్ యార్డుపై 'ఈటల' సంగ్రామం: 27 నుంచి పాదయాత్ర

(?వినోద్, ప్రజా తీర్పు, జవహర్ నగర్, మేడ్చల్ జిల్లా) అక్టోబర్ 23 :-

జవహర్ నగర్ డంపింగ్ యార్డు వల్ల హైదరాబాద్ నగరానికి, స్థానిక ప్రజలకు ఎదురవుతున్న తీవ్ర కాలుష్య ముప్పును నివారించాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ సమస్యపై ఈనెల 25న రౌండ్ టేబుల్ సమావేశం, 27వ తేదీ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశంలో బీజేఎల్పీ నాయకులు, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మరియు బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

?ఈటల రాజేందర్ వ్యాఖ్యలు ఉ ముఖ్యాంశాలు:

?తీవ్ర ఆరోగ్య ముప్పు: డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న లీచేట్ (మలిన నీరు) వల్ల చెరువుల్లో చేపలు చనిపోతున్నాయని, కీసర, ఘట్కేసర్, దమ్మాయిగూడ ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసనతో పాటు మహిళల్లో గర్భస్రావాలు, క్యాన్సర్లు, శ్వాసకోస సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

?కాలుష్య రికార్డులు: ప్రపంచంలో మీథేన్ వాయువును ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న కేంద్రాల్లో జవహర్ నగర్ 4వ స్థానంలో ఉందన్నారు. ఇక్కడి నుంచి 12 మిలియన్ టన్నుల మీథేన్ వెలువడుతోందని, ఇది 12 లక్షల కార్లు విడుదల చేసే కాలుష్యం కంటే ఎక్కువని తెలిపారు. రేవంత్ రెడ్డిపై విమర్శలు: ప్రశ్నించే గొంతుకని ఎంపీగా గెలిపిస్తే రేవంత్ రెడ్డి ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని, ఆయన చూపిస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు బూటకమని మండిపడ్డారు. ముఖ్యమంత్రిని స్వయంగా కలసి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు.

పరిష్కారాలు చూపాలి: చెత్త నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శాశ్వత పరిష్కారం చూపాలని, రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాకపోతే కేంద్ర ప్రభుత్వం ద్వారా సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. ఇతర బీజేపీ నాయకుల స్పందన: మహేశ్వర్ రెడ్డి (బీజేఎల్పీ నాయకులు): జవహర్ నగర్ ప్రజల ఆవేదన రాహుల్ గాంధీకి, సిఎమ్ రేవంత్ రెడ్డికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఈటల చేపడుతున్న పాదయాత్రకు బీజేపీ పూర్తిగా మద్దతు ఇస్తుందని తెలిపారు.

?ఐక్య పోరాటం: సమస్య కొలిక్కి వచ్చే వరకు జవహర్ నగర్‌లో "సకల జనుల సమ్మె" మోడల్‌లో ఉద్యమిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

మామిడి తోటల్లో పురుగులు, తెగుళ్లపై అప్రమత్తత అవసరం

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబరు 23



మామిడి తోటల్లో ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య చర్యలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాండూర్ వ్యవసాయ అధికారిణి కె. సుష్మ సూచించారు. అక్టోబర్--నవంబర్ కాలంలో తోటల పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మామిడి తోటల్లో మంచు పురుగు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉందని కె. సుష్మ తెలిపారు. ఈ పురుగు ఉధృతి వల్ల 20 నుంచి 100 శాతం వరకు నష్టం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది లేత ఆకులు, పూత గుత్తులు, పిందెలు, కొమ్మలను ఆశించి నష్టం కలిగిస్తుంది. అదేవిధంగా మర పురుగు, ఆకు జడ గూడు పురుగు, బూడిద తెగులు వంటి సమస్యలను కూడా రైతులు గుర్తించి, తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారిణి కే. సుష్మ సూచించారు. ఆకు జడ గూడు పురుగు లేత ఆకులు, పూత గుత్తులను ఆశించి నష్టం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. ఆకులు, కొమ్మలు, పూత, పిందెలు, పండ్లపై మచ్చలు ఏర్పడే తెగుళ్లను తొలిదశలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

మందుల వినియోగంలో జాగ్రత్తలు

పురుగులు, తెగుళ్ల నియంత్రణకు సూచించిన మందులను సరైన మోతాదులోనే వినియోగించాలని, ఒకే మందును పదేపదే ఉపయోగించకుండా అవసరాన్ని బట్టి మందులను మార్చి ఉపయోగించాలని తాండూర్ వ్యవసాయ అధికారిణి కె.సుష్మ సూచించారు. ఒకే పురుగు మందును పదేపదే ఉపయోగించడం వల్ల పురుగుల్లో మందుల ప్రభావాన్ని తట్టుకునే సామర్థ్యం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మామిడి పూత, పిందె దశల్లో తోటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పురుగులు, తెగుళ్ల లక్షణాలను తొలిదశలోనే గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని తాండూర్ వ్యవసాయ అధికారిణి కె. సుష్మ పేర్కొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 23




మంచిర్యాల జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలంలోని భీమారం, భూరుగుపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యా కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ పనులు, పలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రం, పంట కుంటలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులు, గ్రామ పంచాయతీ రికార్డులు, ఇంకుడు గుంతలు, సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అభ్యాసనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలు, సదుపాయాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధన, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. భీమారం గ్రామంలో చేపట్టిన పంట కుంట పనులను పరిశీలించి, వ్యవసాయ అవసరాలకు వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులను ప్రారంభించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవడం ఎంతో అవసరమని, నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో చేపట్టి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను సక్రమంగా, ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, పనుల పురోగతి, రికార్డుల నిర్వహణలో పూర్తి జవాబుదారీతనంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని ఇంకుడు గుంతలను పరిశీలించి, నిర్వహణ తీరును సమీక్షించారు. గ్రామాలలో మురుగునీటి నిర్వహణ సక్రమంగా ఉండేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, త్రాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, వసతి గృహంలో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, మండల విద్యాధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి సతీష్, ఏపీఓ, సంబంధిత గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చొరవను అభినందించిన కేంద్ర మంత్రి

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించేందుకు చేపట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేంద్ర మంత్రి లేఖ

హుస్నాబాద్ అక్టోబర్ 23 రవీందర్ ప్రజా తీర్పు



భూపేంద్ర యాదవ
BHUPENDER YADAV
MINISTER
ENVIRONMENT, FOREST AND CLIMATE CHANGE
GOVERNMENT OF INDIA

O. No. 01/33/2026-HSM Dated: 7th October, 2026

Shri Ponnam Prabhakar Ji,

Please refer to your letter dated 14.07.2026, sharing the initiative of creating a "Steel Bank" consisting complete set of reusable stainless steel utensils for use in functions by Bhagers in your constituency which will reduce single use plastic and plastic waste at grass root level. In this regard, various initiatives have been undertaken by Government of India to address the issue of plastic pollution.

India recognized the need to respond to the global environmental challenge of plastic pollution, much before it had gained global attention and traction. The strategy adopted to tackle unmanaged and littered plastic waste includes ban on identified single-use plastic items having high littering potential and low utility, implementation of market based Extended Producer Responsibility (EPR) on plastic packaging, reducing plastic consumption through reuse and sustainable plastic packaging principles, and encouraging the development of new business models/startups and innovation for eco-alternatives.

Central Government, State Governments and local authorities have taken steps on moving towards eco-friendly alternatives for elimination of single use plastics. The ban of identified single use plastics has triggered development of eco-alternatives and new implementation models. The Ministry of Environment, Forests and Climate Change had prepared a "Compendium of Manufacturers / Sellers of Eco-alternatives to Banned Single Use Plastic Items", which was also launched on World Environment Day (WED), 2025. The Compendium is available and accessible on website of Central Pollution Control Board for wider dissemination and use.

I firmly believe that through the positive steps taken by States / UTs following the Whole of Government" and "Whole of Society", we would be able to address plastic pollution caused by single use plastics in a sustainable and effective manner.

నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించేందుకు 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ చొరవను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రస్తావించారు.ఈ మేరకు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ లేఖ రాశారు. గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, ఇతర వేడుకల్లో వినియోగించుకునేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల పూర్తి సెట్లతో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్లాస్టిక్ వినియోగాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను క్షేత్రస్థాయిలో తగ్గించేందుకు దోహదపడుతుందని లేఖలో పేర్కొన్నారు.ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి వివరించారు. అధిక కాలుష్యానికి కారణమయ్యే, తక్కువ ఉపయోగం కలిగిన గుర్తించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం, ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌పై ఉత్పత్తిదారుల విస్తరించిన బాధ్యత అమలు, వస్తువులను తిరిగి వినియోగించడం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం వంటి చర్యలు ఇందులో భాగమని తెలిపారు. ప్లాస్టిక్‌కు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తయారు చేసిన 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాల తయారీదారులు, విక్రేతల సంకలనంను 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంకలనం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో కృషి చేస్తే ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వల్ల కలిగే కాలుష్యాన్ని సమర్థవంతంగా, స్థిరమైన పద్ధతుల్లో నియంత్రించవచ్చని కేంద్ర మంత్రి తన లేఖలో అభిప్రాయపడ్డారు. గ్రామీణ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు 'స్టీల్ బ్యాంక్' ఒక ఉపయోగకరమైన ఆలోచనగా నిలుస్తుంది. శుభకార్యాల్లో స్టీల్ పాత్రలను తిరిగి వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలనే లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు చేపట్టిన ఈ చొరవ పర్యావరణహిత జీవన విధానాల ప్రోత్సాహానికి దోహదపడనుందని లేఖలో పేర్కొన్నారు.



పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరం: సూర్యాపేట జిల్లా పోలీసు కళా బృందం

(అనంతుల శ్రీనివాస్ గౌడ్,ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 23

సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 23: పోలీస్ ఫ్లాగ్ డే మరియు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో తిరుమలగిరి, నాగారం, మరియు అర్వపల్లి మండల కేంద్రాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండల కేంద్రాల ప్రధాన సెంటర్లలో కళా బృందం సభ్యులు పోలీసు అమరుల త్యాగాలను స్మరిస్తూ పాటలు, కళా రూపాలు, మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు నిర్వర్తిస్తున్న విధులను, వారి త్యాగాలను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. సమాజంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొనడానికి, ప్రజలు హాయిగా జీవించడానికి పోలీసులు రాత్రింబవళ్ళు అసాధారణ పరిస్థితులలో విధులు నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఆయా మండలాల స్థానిక పోలీసు సిబ్బంది కూడా పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పౌరులంతా పోలీసుల త్యాగాలను గుర్తించాలని, వారి త్యాగాల ఫలితమే నేడు సమాజంలో కనిపిస్తున్న శాంతిభద్రతలు అని వారు పేర్కొన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు పెంపొందించుకుంటూ, నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసులతో కలిసి సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం నందు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ రక్తదాన శిబిరంలో పౌరులు ప్రజలు యువత అధిక సంఖ్యలో పాల్గొని అమరుల చిహ్నంగా రక్తదానం చేయాలని తల సేమియా వ్యాధి రోడ్డు ప్రమాదాలలో రక్తం కోల్పోయిన వారికి ఇలాంటి వారికి అత్యవసర సమయంలో రక్తం అందజేయడానికి ముందుకు రావాలని సూచించారు. అలాగే సైకిల్ ర్యాలీలు కొవ్వొత్తుల ర్యాలీలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించాలని సూచించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని సామాజిక అంశాలు సైబర్ మోసాల నివారణ పట్ల ప్రజల చైతన్యము మాదకద్రవ్యాల నివారణ పట్ల ప్రజల చైతన్యము భాగస్వామ్యాలకు సంబంధించి రోడ్డు ప్రమాదాల నివారణ ప్రజల భాగస్వామ్యం కు సంబంధించి వ్యాసరచన పోటీలు ఉంటాయని వీటిల్లో విద్యార్థులు అధికంగా పాల్గొనాలని తెలిపారు.

ఎల్లారెడ్డిపేట ఠాణా లో ఓపెన్ హౌస్

- చట్టాలపై అవగాహన కల్పించిన సీఐ వెంకటేష్

ఎల్లారెడ్డిపేట, ప్రజాతీర్పు తీర్పు,అక్టోబర్23



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిర్వహించే విధులు, ప్రజల భద్రత కోసం అందిస్తున్న సేవల గురించి ప్రత్యక్షంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ నేతృత్వంలో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ విద్యార్థులకు సాదరంగా స్వాగతం పలికి, పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, వాటి పనితీరు గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరిస్తారు, ఫిర్యాదుల నమోదు ప్రక్రియ ఎలా ఉంటుంది, జనరల్ డైరీ (జీడీ)లో వివరాలను ఎలా నమోదు చేస్తారు, ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను ఏ విధంగా నమోదు చేస్తారు అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదిని చూపించి, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రోజువారీ విధులపై అవగాహన కల్పించారు.

పోలీస్ పరికరాలపై ప్రత్యక్ష అవగాహన.

శాంతిభద్రతల పరిరక్షణ, విధుల నిర్వహణలో పోలీసులు ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, వాకీటాకీలు, ఇతర సమాచార ప్రసార పరికరాలను విద్యార్థులకు పరిచయం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సిబ్బంది సమాచారాన్ని ఎలా చేరవేసుకుంటారు, విధుల్లో ఉన్నప్పుడు భద్రతా పరికరాలు ఏ విధంగా ఉపయోగపడతాయి అనే విషయాలను వివరించారు.

ఆపదలో డయల్ 100, 112 సేవలు.

ఆపద సమయాల్లో ప్రజలు పోలీసుల సహాయం పొందేందుకు డయల్ 100, 112 అత్యవసర సేవలను ఎలా వినియోగించుకోవాలో సీఐ వెంకటేష్ వివరించారు. మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేసే షీ టీమ్స్ సేవలు, వేధింపులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

విద్యార్థుల భద్రతకు సంబంధించిన పోక్సో చట్టం, బాల్యవివాహాల నివారణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులు వివరించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు వెల్లడించకూడదని, అనుమానాస్పద లింకులను తెరవ కూడదని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఆన్‌లైన్‌లో వేధింపులు లేదా మోసాలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

విద్యార్థుల్లో చట్టాల పట్ల అవగాహన పెంపు.

కార్యక్రమంలో విద్యార్థులు పోలీస్ విధులు, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణకు సంబంధించిన పలు సందేహాలను అడగగా, పోలీస్ అధికారులు వాటికి సమాధానాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహర్ చారి, ఉపాధ్యాయులు అజ్మీరా భీక్కు నాయక్ మాట్లాడుతూ.. సమాజంలో పోలీసుల పాత్ర ఎంత కీలకమైనదో విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెరగడంతోపాటు, పోలీసుల పట్ల ఉన్న అపోహలు తొలగి, చట్టాలను గౌరవించే బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ పారిశ్రామిక ప్రమాదాలు?

- కార్మికుల ప్రాణాలకు భద్రతేది?
- పరిశ్రమల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యమెందుకు?
- సిగాచి ఘటన మరువకముందే సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ.. ఇద్దరు కార్మికుల మృతి..
- సిగాచి ఘటన నుండి గుణపాఠం నేర్చుకోవడంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం..
- మృతుల కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారం..
- అంత్యక్రియల కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం..
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం..

పటాన్చెరు అక్టోబర్ 23 ప్రజా తీర్పు

సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం తాలూకు విషాదం మరువకముందే.. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు.. పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరాక పరిశ్రమ గ్యాస్ లీకేజీ ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు యాజమాన్యంతో చర్చించి 70 లక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు అంత్యక్రియల కోసం లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత



యాజమాన్యాన్ని ఆదేశించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి వెళ్లిన ఎమ్మెల్యే జిఎంఆర్.. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యంతో పాటు వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన పైన పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక శాసనసభ్యుడిగా కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. పారిశ్రామిక అభివృద్ధికి పటాన్చెరు ప్రాంతం కీలక కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి, లాభాల పెరుగుదల మాత్రమే కాదని.. అక్కడ పనిచేసే ప్రతి కార్మికుడి ప్రాణానికి భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు పనిచేస్తున్నాయా? గ్యాస్ లీకేజీలను నివారించే రక్షణ చర్యలు తీసుకుంటున్నారా? అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలి

సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీకి దారితీసిన కారణాలను వెలికితీయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రతా లోపాలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని గుర్తించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సిగాచి ఘటన నుంచి తగిన గుణపాఠాలు నేర్చుకుని కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, వరుస పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని విమర్శించారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జీఎంఆర్ హామీ ఇచ్చారు. కార్మికుల భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఉప జిల్లా వైద్యాధికారి

నర్సంపేట రూరల్, ఖానాపూర్, అక్టోబర్ 23, ప్రజా తీర్పు ప్రతినిధి:

ఈ రోజు నర్సంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మరియు జిల్లా రోగనిరోధక అధికారి వైద్యులు ప్రకాష్ సందర్శించారు. ఈ రోజు జరుగుతున్న ప్రత్యేక రోగ నివారణ తడికల కార్యక్రమం ఇంద్రధనస్సు పథకం అమలు తీరును తెలుసుకున్నారు. ఇంద్రధనస్సు పథకం జరుగుతున్న ధర్మారావుపేట ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంద్రధనస్సు పథకం అనేది మామూలు తడికల కార్యక్రమంలో తడికలు వేయించుకోని చిన్న పిల్లలను, కడుపుతో ఉన్న తల్లులను తప్పక గుర్తించి తడికలు వేయించే ప్రత్యేక కార్యక్రమం అని తెలిపారు.లికుష్ట వ్యాధి నిర్మూలనలో భాగంగా ఇంటింటి తనిఖీ:లిజాతీయ కుష్ట వ్యాధి నిర్మూలనలో భాగంగా రేపటి నుండి కుష్ట వ్యాధి గుర్తింపు ప్రచారాన్ని చేపడుతున్నామని తెలిపారు.ఆశా కార్యకర్తలు రేపటి నుండి పద్నాలుగు రోజుల పాటు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శిస్తారు. ప్రతి ఇంటికి వెళ్లి శరీరంపై తెల్లటి మచ్చలు, స్పర్శ తెలియని మచ్చలు, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు, బలహీనత, స్పర్శ కోల్పోవడం వంటి గుర్తులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటారు. ఎవరికైనా ఆ గుర్తులు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువస్తారు. కుష్ట వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు దొరుకుతాయని, ఈ వ్యాధి పట్ల భయాన్ని వదిలేయాలని కోరారు. తక్కువ మచ్చలు ఉంటే ఆరు నెలలు, ఐదుకు మించి మచ్చలు ఉంటే ఏడాది పాటు మందులు వాడితే కుష్ట వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. కుష్ట వ్యాధి లేని సమాజాన్ని తయారు చేయడానికే ఈ పనిని చేస్తున్నామని తెలిపారు.

ఎండ తీవ్రత పట్ల జాగ్రత్తలు:

ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల వడదెబ్బ, నీరు తగ్గిపోవడం వంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: – నీరు ఎక్కువగా తాగండి ?– మధ్యాహ్నం ఎండలో బయట తిరగవద్దు – చిన్న పిల్లలు, పెద్దవారు, కడుపుతో ఉన్న తల్లుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టండి – వడదెబ్బ గుర్తులు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను కలవండి – ప్రతి ఇంట్లో ఉప్పు చక్కెర నీళ్ల పొట్లాలు అందుబాటులో ఉంచుకోండి. ఆరోగ్య శాఖ పిలుపు: ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండండి – వడదెబ్బ నుండి మీ కుటుంబాన్ని కాపాడుకోండి. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోతి , ఉప కేంద్ర అధికారి నంద మరియు వైద్య సిబ్బంది శ్రీనివాస చారి, దేవిక, చిన్ని, సబిత, ప్రతిభ, భాస్కర్ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్ నినో ప్రభావం పై ముందస్తు చర్యలు తీసుకోవాలి

నర్సంపేట రూరల్, అక్టోబర్ 23, ప్రజా తీర్పు ప్రతినిధి:

జిల్లా పంచాయతీ అధికారి మరియు మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ప్రస్తుత వాతావరణ మార్పులు మరియు ఎల్‌నినో తీవ్రత నేపథ్యంలో, రైతులు మరియు సామాన్య ప్రజలు నష్టాలను తగ్గించుకోవడానికి ముందస్తుగా అనుసరిస్తున్న వ్యూహాలు ఇక్కడ క్లుప్తంగా ఇవ్వబడ్డాయి:

1. రైతులు ముందస్తుగా తీసుకుంటున్న చర్యలు

ఆరుతడి పంటల వైపు మొగ్గు తీవ్ర నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే వరి వంటి పంటలను తగ్గించి, తక్కువ నీటితో పండే కంది, పెసర, జొన్న, మరియు మొక్కజొన్న వంటి ఆరుతడి లేదా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటున్నారు.

నీటి సంరక్షణ మరియు సూక్ష్మ సేద్యం భూగర్భ జలాలు తగ్గిపోతున్నందున బిందు సేద్యం తుంపర సేద్యం వంటి అధునాతన పద్ధతులను వాడుతున్నారు. పొలాల్లో "ఫామ్ పాండ్స్" తవ్వి వర్షపు నీటిని నిల్వ చేసుకుంటున్నారు.స్మార్ట్ వ్యవసాయ సాంకేతికత : వాతావరణ మార్పులు, తెగుళ్ల సమాచారాన్ని ముందే తెలుసుకోవడానికి మొబైల్ యాప్‌లు మరియు ప్రభుత్వ శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తున్నారు.

2. సాధారణ ప్రజలు ముందస్తుగా తీసుకుంటున్న అంశాలు

తాగునీటి పొదుపు మరియు నిల్వ: ఎల్‌నినో వల్ల వేసవి తీవ్రత పెరిగి, నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున, నివాస ప్రాంతాలలో నీటిని వృథా చేయకుండా రీసైక్లింగ్ మరియు పొదుపు చర్యలు చేపడుతున్నారు. ఆర్థిక ప్రణాళిక ఉ నిత్యావసరాల నిర్వహణ: వాతావరణ ప్రభావం వల్ల పండ్లు, కూరగాయలు, మరియు ఆహార ధాన్యాల ధరలు మార్కెట్‌లో పెరిగే అవకాశం ఉంటుంది. దీనిని తట్టుకోవడానికి ప్రజలు తమ నెలవారీ బడ్జెట్‌ను ముందే క్రమబద్ధీకరించుకుంటున్నారు. ఆరోగ్య జాగ్రత్తలు: అధిక ఉష్ణోగ్రతలు మరియు వడగాల్పుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా వైద్య సదుపాయాలు, అవసరమైన మందులు మరియు ఆహార నియమాలను పాటిస్తున్నారు. ఈ విధంగా వాతావరణ అనిశ్చితిని మరియు ఆధునిక మార్కెట్ మార్పులను తట్టుకోవడానికి ఉమ్మడి ప్రణాళికలతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంపీ ఓ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల : శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్

(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు,మంచిర్యాల) అక్టోబర్ 23

మంచిర్యాల పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి,కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్టేషన్‌లోని రిసెప్షన్,కేసు డైరీలు,జనరల్ డైరీ,వివిధ రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించి,వాటిని నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ,స్టేషన్ పరిధిలోని కాలనీలు, సమస్యాత్మక ప్రాంతాల్లో తరచూ పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలను పెంపొందించుకోవాలని,ముఖ్యంగా యువతను గంజాయి,ఇతర మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సైబర్ నేరాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ తనిఖీ లో శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్,ఎస్ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

షఫాలీ విధ్వంసం.. రావల్ శతకం.. జింబాబ్వేపై భారత్ ఘన విజయం!

జింబాబ్వేతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టు బోణీ కొట్టింది. వడోదర వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రతికా రావల్ అజేయ శతకంతో చెలరేగగా.. షఫాలీ వర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొట్టింది. దీంతో తొలి వన్డేలో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత జింబాబ్వే 49.5 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌట్ కాగా.. లక్ష్యాన్ని భారత్ 26.2 ఓవర్లలోనే ఛేదించింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

శ్రీ చరణి దెబ్బకు కుప్పకూలిన జింబాబ్వే

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే భారత బౌలర్ల ధాటికి పరుగులు చేయడానికి ఇబ్బందిపడింది.

ప్రజా తీర్పు కథనం ఎఫెక్ట్ కదిలిన అధికార యంత్రాంగం ప్రాణాపాయం తప్పనున్నదన్న సంతోషంలో బాధిత కుటుంబాలు

- ఖాళీ స్థలాలలో భారీగా పెరిగిన పిచ్చి మొక్కలు కథనం
- స్పందించిన సర్పంచ్ అధికారులకు కృతజ్ఞతలు

(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట) అక్టోబర్ 23



మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో భారీగా పిచ్చి మొక్కలు పెరిగాయి అనే వార్త కథనం ప్రచురుతమైన విషయం తెలుసుకున్న అధికారులు సర్పంచ్, పాలకవర్గం తో కలసి శుక్రవారం జెసిబిసహాయంతో పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించారు ఇంకా మాసాయిపేటలో ఎక్కడైనా పిచ్చి మొక్కలు పెరిగితే గ్రామపంచాయతీ ఆఫీస్ లో ఫిర్యాదు చేయాలని మన ఇంటి ముందు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెట్లు భారీగా పెరగడంతో అక్కడ పాములు, పందులు, దోమలు అభివృద్ధి చెందుతాయని వాటి వల్ల వచ్చే ప్రమాదం బీద ప్రజలు తట్టుకోలేనంతగా ఉంటాయని ప్రతి వ్యక్తిగత శుభ్రతతో పాటు చుట్టు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. పిచ్చి మొక్కల్ని తొలగించడంతో అక్కడ బాధపడుతున్న కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సర్పంచ్ పాలకవర్గం ధన్యవాదాలు అధికారులకు, సెక్రటరీ పత్రిక విలేకరులకు ఏడో వాడు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశ్నించే గొంతుకలపై పాసవిక చర్యలు జర్నలిస్ట్ శంకర్ అరెస్ట్ అప్రజాస్వామికం

జర్నలిస్టుల గొంతు నొక్కితే నిజాలు మరుగున పడతాయా?

(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట) అక్టోబర్ 23.



మెదక్ జిల్లా పత్రిక సమావేశంలో మాదిగ జర్నలిస్ట్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు మాసాయిపేట్ భూపాల్ మాదిగ మాట్లాడుతు ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని పాలకులను ప్రశ్నించడం జర్నలిస్టుల బాధ్యత అని, ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం మీడియా ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. మెడికవర్ ఆస్పటల్ వైద్యుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియజేయడం తప్ప అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకవేళ జర్నలిస్ట్ శంకర్ చేసిన వార్తలు నిరాధారమైనవి అయితే ఖండించాలి తప్ప కక్షపూరితంగా వ్యవహరించి కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జర్నలిస్టులపై ఇలాంటి అక్రమ కేసులు పెట్టడాన్ని ఆయన ఖండించారు. జర్నలిస్టు శంకరును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడితే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని ఆయన హెచ్చరించారు. మెడికవర్ హాస్పటల్లో జరిగిన మరణాలపై ప్రశ్నించిన శంకర్ పై 126(2),115(2),351(2),329,324,352,3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ అక్రమాలను ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కుతున్నారని ఆయన ప్రభుత్వంపై మండిపడ్డాడు. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణిచివేయాలని చూడటం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, అరెస్టు చేసిన శంకరును వెంటనే విడుదల చేయాలని మీడియా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్
- హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

హుస్నాబాద్ అక్టోబర్ 23 రవీందర్ ప్రజా తీర్పు

బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం,



ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు.బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని సతీష్ కుమార్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020